# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 192 | హైదరాబాద్ | బుధవారం 21-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ఆ కంపెనీని కొనమంటారా, వద్దంటారా... ఎక్స్ యూజర్లను అభిప్రాయం అడిగిన ఎలాన్ మస్క్

## దావోస్‌లో ఐబీఎం ఛైర్మన్ తో

# సీఎం కీలక సమావేశం

- అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన
- క్వాంటం టెక్నాలజీలో ఏపీకి అగ్రస్థానం కల్పించాలని విజ్ఞప్తి
- 10 లక్షల మంది ఏపీ యువతకు ఏఐలో శిక్షణ ఇవ్వాలని కోరిన లోకేశ్
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ఐబీఎం




11లో



11లో


## ఇకపై నితిన్ నబినే నా బాస్..

# నేను కార్యకర్తను మాత్రమే

- బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్
- పార్టీ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన జాతీయ అధ్యక్షుడిగా గుర్తింపు
- నూతన అధ్యక్షుడిని అభినందించిన మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్
- వికసిత భారత్ లక్ష్య సాధనలో నబిన్ నాయకత్వం కీలకమన్న ప్రధాని

## సిట్ నన్ను అడగడం కాదు..

# నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా



11లో

: ఏడు గంటల విచారణ అనంతరం హరీశ్ రావు

- దమ్ముంటే ఈరోజు విచారణకు సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని సవాల్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకేం సంబంధమని ప్రశ్న
- అప్పుడు నేను హోంమంత్రిగా పని చేశానా అని నిలదీత

## బలవంతంగా ట్రాఫిక్ చలాన్లు


# వసూలు చేయవద్దు

### హైకోర్టు కీలక ఆదేశాలు

- వాహనం లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదన్న హైకోర్టు
- వాహనదారుడు చెల్లిస్తేనే చలానా మొత్తం తీసుకోవాలన్న హైకోర్టు
- వాహనదారుడికి చెల్లించడం ఇష్టంలేకపోతే నోటీసులు జారీ చేయాలన్న హైకోర్టు

11లో








11లో

## స్కిల్స్ ఉన్నాయి.. కానీ సంతృప్తి లేదు..

# భారత ఉద్యోగులపై సర్వేలో కీలక విషయాలు!

- భారత ఉద్యోగుల్లో 95 శాతం మందికి నైపుణ్యాలపై పూర్తి నమ్మకం
- ఉద్యోగంలో సంతృప్తిగా ఉన్నది కేవలం 64 శాతం మంది మాత్రమే
- సగానికి పైగా ఉద్యోగుల్లో తీవ్ర ఒత్తిడి, పనిభారంతో బర్న్‌అవుట్
- ఉద్యోగుల సంక్షేమంపై కంపెనీలు దృష్టి పెట్టాలని నిపుణుల సూచన

## ఫ్యూచర్ సిటీ కోసం తెలంగాణ ప్రభుత్వంతో

# చేతులు కలిపిన యూఏఈ

- రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందాన్ని కలిసిన యూఏఈ మంత్రి


11లో



## సంప్రదాయబద్ధంగా

# శబరిమల ఆలయం మూసివేత

- మండల-మకరవిళక్కు సీజన్ ముగియడంతో శబరిమల ఆలయం మూసివేత
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు.. విజయవంతంగా ముగిసిన యాత్ర
- పందలం రాజవంశీయులకు తాళాలు అప్పగించి సన్నిధికి తాళం
- ఫిబ్రవరి 12న నెలవారీ పూజల కోసం మళ్లీ తెరవనున్న ఆలయం



11లో

భారత శక్తి

# ఇస్రోకు ఏమైంది....

ఇస్రో ఎంతో విలువైనదిగా భావించే పీఎస్ఎల్వీ రాకెట్ ఇప్పుడు వరుస వైఫల్యాలను ఎదుర్కొంది. ఇస్రో వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ విభాగమైన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) జనవరి 12న పీఎస్ఎల్వీ–సీ62 ద్వారా మొత్తం 16 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపే ప్రయోగాన్ని నిర్వహించింది. వీటిలో ఈఓఎస్–ఎన్1 ఉపగ్రహం కూడా ఉంది. కానీ, రాకెట్ పనితీరులో ఒక లోపం తలెత్తిందని ఇస్రో తెలిపింది. రాకెట్ వెళ్లాల్సిన మార్గం నుంచి పక్కకు తప్పుకుందని వెల్లడించిన ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహిస్తామని చెప్పారు. కిందటేడాది మే నెలలో ఇస్రో ప్రయోగించిన పీఎస్ఎల్వీ–సీ61 ప్రాజెక్టు కూడా విఫలమైంది. దీంతో పీఎస్ఎల్వీ రాకెట్లకు ఇది వరుసగా రెండో వైఫల్యమని నిపుణులు భావిస్తున్నారు. ఇస్రో ఇప్పటివరకు పీఎస్ఎల్వీ రాకెట్లతో 63 మిషన్లు పూర్తి చేసింది. చంద్రయాన్–1, మంగళ్యాన్ (మార్స్ ఆర్బిటర్ మిషన్), సూర్యుడిని పరిశోధించే ఆదిత్య ఎల్–1 వంటి కీలక మిషన్లలో ఇస్రో పీఎస్ఎల్వీ రాకెట్లనే ఉపయోగించింది. 2017లో ఒకే మిషన్‌లో 104 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపి ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ–సీ61మిషన్ 2025 మే 18న విఫలమైంది. ఇస్రో చరిత్రలో దీన్ని అత్యంత అరుదైన వైఫల్యాల్లో ఒకటిగా పరిగణిస్తారు. దాదాపు 8 నెలల విరామం తర్వాత, ఇప్పుడు (జనవరి 12) పీఎస్ఎల్వీ రాకెట్ మరోసారి గమ్యాన్ని చేరుకోలేకపోయింది. కానీ, ఈ సమస్య ఇక్కడితోనే ముగియదని మొహాలీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వి. వెంకటేశ్వరన్ అన్నారు. కిందటేడాది మే నెలలో చేపట్టిన సీ61 ప్రయోగం ఎందుకు విఫలమైందో ఇప్పటికీ స్పష్టమైన కారణాలు తెలియరాలేదు'మామూలుగా ఏ రాకెట్ ప్రయోగం జరిగినా, అది విజయవంతమైనా లేదా విఫలమైనా దాని పనితీరుపై లోతైన విశ్లేషణ జరుగుతుంది. గతంలో ఏదైనా ప్రాజెక్టు విఫలమైతే దానిపై ఇచ్చే 'ఫెయిల్యూర్ అసెస్‌మెంట్ రిపోర్ట్' చాలా పారదర్శకంగా ఉండేది. పీఎస్ఎల్వీ–సీ61 ప్రాజెక్టుకు సంబంధించిన ఫెయిల్యూర్ అసెస్‌మెంట్ రిపోర్టును ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపారు. కానీ, ఇప్పటికీ దాన్ని బహిరంగంగా విడుదల చేయలేదు. ఆ ప్రయోగం ఎందుకు విఫలమైందో అసలు కారణాలు ఇప్పటికీ ప్రజలకు తెలియడం లేదుభారత అంతరిక్ష రంగ నియంత్రణ సంస్థ ఇన్–స్పేస్ రాబోయే పదేళ్ల కోసం ఒక భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.'ప్రపంచ అంతరిక్ష మార్కెట్‌లో 2033 నాటికి భారత్ వాటాను 8 శాతానికి పెంచడం. తద్వారా భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 44 బిలియన్ డాలర్లకు చేర్చడమే మా లక్ష్యం' అని తన భవిష్యత్ ప్రణాళికల్లో ఇన్ –స్పేస్ పేర్కొంది. ప్రపంచ అంతరిక్ష మార్కెట్‌లో 2023 నాటికి భారత్ వాటా 2 శాతంగా ఉందని, భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఇన్–స్పేస్ వెల్లడించింది. ప్రభుత్వ మద్దతు బలంగా ఉండటం, సాంకేతిక అభివృద్ధి, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం ద్వారా ఈ లక్ష్యం సాధ్యమవుతుందని ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్) అభిప్రాయపడింది.

'అంతర్జాతీయ మార్కెట్‌ను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో ఇస్రో గర్వంగా భావించే పీఎస్ఎల్వీ రాకెట్ రెండుసార్లు విఫలం కావడం ఇస్రోకు ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే అంతర్జాతీయ మార్కెట్‌లో పీఎస్ఎల్వీ రాకెట్ విశ్వసనీయత ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతుంది' అనే అభిప్రాయం బలపడుతోంది. పీఎస్ఎల్వీకి ఇప్పుడు తగిలిన ఎదురుదెబ్బల నుంచి పాఠాలు నేర్చుకొని తర్వాతి ప్రయోగాలను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని వార్తా ఏజెన్సీ ఏఎన్ఐతో శాస్త్రవేత్త సువేందు పట్నాయక్ అన్నారు.

'రైలు బోగీలు ఒకదానితోఒకటి ఎలా అనుసంధానమై ఉంటాయో, అలా పీఎస్ఎల్వీ కూడా 4 రాకెట్ల కలయిక. ప్రయోగించడానికి రాకెట్ సిద్ధంగా ఉన్నప్పుడు, కింద నుంచి పైకి వరుసగా పీఎస్1, పీఎస్2, పీఎస్3, పీఎస్4 అనే నాలుగు విభాగాలు అనుసంధానమై ఉంటాయి. ఇందులో పీఎస్1, పీఎస్3లలో ఘన ఇంధనం ఉంటుంది. మిగతా రెండింటిలో ద్రవరూప ఇంధనం నింపుతారు' అని ఆయన వివరించారు.'పీఎస్1లో ఉండే ఘనరూప ఇంధన రాకెట్, భూమి నుంచి గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పైకి లేవడానికి కావాల్సిన ప్రొపల్షన్‌ను అందిస్తుంది. ఈ దశలో నిశ్చల స్థితిలో ఉన్న రాకెట్ థ్రస్ట్‌ను అందుకొని పైకి కదులుతుంది. అయితే ఈ దశలో భూమి నుంచి కొన్ని కిలోమీటర్ల ఎత్తు వరకే రాకెట్ ఎగరగలదు' అని ఆయన వివరించారు.'పీఎస్2లో ద్రవ ఇంధనం ఉంటుంది. రాకెట్ ఏ దిశలో వెళ్లాలనే అంశాన్ని ఇది నిర్ణయిస్తుంది. అలాగే, రాకెట్ ఏ కక్ష్యలోకి వెళ్లాలో కూడా ఈ దశలోనే ఖరారవుతుంది. దీని తర్వాత మూడో దశలో మళ్లీ ఘన ఇంధనాన్ని ఉపయోగించుకొని అంతరిక్షంలో రాకెట్ మరింత ఎత్తుకు వెళుతుంది. చివరిదైన నాలుగో దశలో ద్రవ ఇంధనం ఉంటుంది. ఇది ఉపగ్రహాలను వాటి నిర్దేశిత కక్ష్యలో కచ్చితంగా ప్రవేశపెట్టేలా చేస్తుంది' అని వెంకటేశ్వరన్ తెలిపారు. పీఎస్ఎల్వీ–సీ62 ప్రాజెక్టులో రాకెట్ మూడో దశ వరకు అనుకున్న విధంగానే ముందుకు సాగిందని వెంకటేశ్వరన్ చెప్పారు. ఈ దశకు చేరుకున్నాక ఒక పెద్ద సమస్య ఎదురైనట్లు తెలిపారు. ఆవిరి పీడనం తగినంత లేకపోవడమే ఈ సమస్య రావడానికి కారణమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారని పేర్కొన్న వెంకటేశ్వరన్, దీని వెనుక ఉన్న శాస్త్రీయ కారణాన్ని సులభంగా వివరించే ప్రయత్నం చేశారు.'గాలితో నిండిన బెలూన్ మూతిని తెరిస్తే అది వ్యతిరేక దిశలో వేగంగా వెళ్తుంది. కానీ, బెలూన్ మూతినివెడల్పుగా తెరిస్తే, గాలి వేగంగా బయటకు వెళ్లిపోయి బెలూన్ వేగం మారొచ్చు. రాకెట్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. రాకెట్ నడుస్తున్నప్పుడు, దాని పొగ బయటకు వచ్చే ముక్కు భాగం (నాజిల్) వద్ద అనుకున్న స్థాయిలో ఒత్తిడి (ప్రెజర్) ఏర్పడలేదు' అని ఆయన వివరించారు.

# వరుస వివాదాల్లో దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం, జనవరి 20(భారత శక్తి):

ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆశించిన అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పుడు పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వరుస వివాదాల్లో చిక్కుకోవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గత కొంతకాలంగా ఆయనపై వస్తున్న ఆరోపణలు కేవలం వ్యక్తిగత విమర్శలకే పరిమితం కాకుండా, శాంతిభద్రతల సమస్యగా, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశాలుగా మారుతున్నాయి. వివాదాల పరంపర మే 2025లో జిల్లా పరిషత్ సమావేశం వేదికగా ప్రారంభమైంది. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పట్ల ఎమ్మెల్యే ప్రసాద్, మరికొందరు అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమె పర్సనల్ చాంబర్‌లోకి బలవంతంగా చొరబడి, మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోటో ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసభ్య పదజాలంతో దూషించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మహిళా నాయకురాలి పట్ల ఎమ్మెల్యే తీరుపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇక ఆగస్టు 2025లో వెలుగులోకి వచ్చిన ఒక ఆడియో క్లిప్ ఎమ్మెల్యే రాజకీయ జీవితంలో పెను తుపాను సృష్టించింది. టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్‌ను ఉద్దేశించి ఆయన అసభ్య వ్యాఖ్యలు చేశారని, అనంతపురంలో ఆయన సినిమా 'వార్ 2' ప్రదర్శించకుండా అడ్డుకుంటామని బెదిరించారని ఎన్టీఆర్ అభిమానులు భగ్గుమన్నారు. ఈ వ్యవహారం ముదిరి ఎమ్మెల్యే కార్యాలయంపై దాడులు, నిరసనలకు దారితీసింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని మందలించడంతో, ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పి సర్దుబాటు చేసుకున్నప్పటికీ, అభిమానుల్లో ఆయనపై ఉన్న ఆగ్రహం చల్లారలేదు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. జనవరి 13న అనంతపురంలోని ఒక ఎగ్జిబిషన్ వద్ద ఎమ్మెల్యే గన్‌మన్ షేక్ షా చేసిన హల్‌చల్ సంచలనం సృష్టించింది. నిర్వాహకుల నుంచి రూ.10 లక్షల మామూలు డిమాండ్ చేశారని, నిరాకరించినందుకు స్టాఫ్‌పై దాడి చేసి భయానక వాతావరణం సృష్టించారని బాధితులు వాపోతున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గన్‌మన్‌ను సస్పెండ్ చేసినప్పటికీ, ఈ వ్యవహారం వెనుక ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, ఇటీవల ఎమ్మెల్యే అనుచరులపై మరిన్ని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అడిగినంత డబ్బు ఇవ్వలేదని ఒక వైన్ షాపును తగలబెట్టించారనే ఆరోపణలున్నాయి. విలువైన భూములను ఆక్రమించుకోవడం లేదా సెటిల్‌మెంట్ల పేరుతో బెదిరింపులకు దిగడం అలవాటుగా మారిందని స్థానికులు చెప్పుకుంటున్నారు. ఆస్రా కళ్ల అద్దాల దుకాణానికి సంబంధించి ఒక భూ వివాదంలో ఎమ్మెల్యే తలదూర్చారు. అసభ్యకరమైన పదజాలంతో దుకాణం మహిళా యజమానిపై వ్యాఖ్యలు చేశారు. ఆ ఆడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ ఆరోపణలన్నింటినీ ఎమ్మెల్యే వర్గం 'రాజకీయ కుట్ర'గా కొట్టిపారేస్తోంది. అయితే, జిల్లాలో ఎంతోమంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, కేవలం దగ్గుపాటి ప్రసాద్ పైనే ఇన్ని రకాల ఆరోపణలు ఎందుకు వస్తున్నాయన్నది ప్రజల ప్రశ్న. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్లుగా, ఆయన అనుచరుల అరాచకాలు శ్రుతి మించుతున్నాయని సామాన్య ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజల



సమస్యలు తీర్చాల్సింది పోయి, వసూల్ రాజా అవతారం ఎత్తడంపై ప్రజల్లో అసహనం పెరుగుతోంది. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకుంటున్న తరుణంలో, ఎమ్మెల్యే ప్రసాద్ వ్యవహారం పార్టీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం, పార్టీ నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. నిజానిజాలు విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, ఒక ప్రజాప్రతినిధిగా ఆయన తన నైతికతను కోల్పోయారనే వాదన బలంగా వినిపిస్తోంది.

# వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి

విజయనగరం, జనవరి 20 (భారత శక్తి):

ప్రస్తుతం వైసీపీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందన్న మాట ఆ పార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై పైచేయి సాధించేందుకు ఎంచుకున్న వ్యూహాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదని వారు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం వైసీపీ చేస్తోందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇవన్నీ గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు వాటికి క్రెడిట్ తీసుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ ప్రచారం ప్రజల్లో పెద్దగా ప్రభావం చూపడం లేదని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఏ పని చేసినా అది జరిగినప్పుడే చెప్పుకోవాలి అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని అంటున్నారు. నిజంగా ఆ పనులు అప్పట్లో జరిగి ఉంటే, అప్పుడే వాటిని ప్రజల ముందు బలంగా ఉంచాల్సిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఆలస్యంగా చెప్పుకుంటున్న మాటలకు ప్రజలు పెద్దగా స్పందించడం లేదని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొక వైపు సోషల్ మీడియా ప్రచారం కూడా పార్టీకి కలిసి రావడం లేదన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటున్న కార్యక్రమాల్లో చేసిన వ్యాఖ్యలను కోట్ చేస్తూ, వాటిని వక్రీకరించి పోస్టులు పెట్టడం ద్వారా లాభం ఉంటుందని భావించారు. కానీ ఈ ప్రయత్నం కూడా ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని నేతలే చెబుతున్నారు. ఇలాంటి అనుచిత ప్రచారం వల్ల ప్రభుత్వానికి నష్టం కంటే, తమకే నష్టం జరుగుతోందన్న భావన పార్టీ లోపల పెరుగుతోంది. మొత్తంగా చూస్తే వైసీపీ ఎంచుకున్న రాజకీయ ఎత్తులు పనిచేయడం లేదన్న భావన బలపడుతోంది. ఇదే సమయంలో పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న నాయకుల సంఖ్య కూడా పెరుగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ముందుగా వీరిని నిలువరించాల్సిన అవసరం ఉందని కొందరు సూచిస్తున్నా, అధిష్టానం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. పోయేవారు పోతే పోనీయండి అన్న ధోరణి కొనసాగుతుండటంతో మిగిలిన నాయకుల్లోనూ నిరాశ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో చిన్న అవకాశం దొరికినా పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నామని కొందరు బహిరంగంగానే చెబుతున్నారని సమాచారం. ఒకప్పుడు బలమైన కేడర్, స్పష్టమైన వ్యూహాలతో ముందుకు సాగిన పార్టీ ఇప్పుడు అయోమయంలో ఉందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందాలంటే కేవలం ప్రచారంతో కాకుండా, స్పష్టమైన దిశానిర్దేశం, నాయకత్వ నిర్ణయాలు అవసరమన్న చర్చ వైసీపీ వర్గాల్లోనే సాగుతోంది. ఇదిలా ఉండగా, గత ఎన్నికల సమయంలోనే తాను మళ్లీ పోటీ చేయబోనని నాని ప్రకటించారు. తన సోదరుడి కుమారుడిని రాజకీయ వారసుడిగా సూచించినా, పార్టీ పెద్దల ఆలోచన వేరేలా ఉన్నట్లు తెలుస్తోంది. నానిని నియోజకవర్గ రాజకీయాల నుంచి తప్పించి, పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలన్న అభిప్రాయం ఉన్నట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. 2029 ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే, ఆయనకు రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి పదవులు దక్కే అవకాశముందన్న ప్రచారం కొనసాగుతోంది. ఇందులో ఎంత నిజం ఉందో రానున్న రోజుల్లో తేలాల్సి ఉంది.

# రైతుల ఒకే చోట రిటర్నబుల్ ప్లాట్లు

విజయవాడ, జనవరి 20,(భారత శక్తి):

రాజధాని అమరావతి విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండో విడత భూసమీకరణ చేపడుతున్న సంగతి తెలిసిందే. ఏడు గ్రామాల పరిధిలో భూమిని సమీకరించనున్నారు. ఇప్పటికే ప్రక్రియ కూడా మొదలైంది. మరోవైపు అమరావతి కోసం తొలివిడత భూసమీకరణ సమయంలో చేసిన విధంగా కాకుండా.. రెండో విడతలో భూములు ఇచ్చే రైతులకు ఒకేచోట రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించాలని సీఆర్డీఏ భావిస్తున్నట్లు సమాచారం. ఏడు గ్రామాల రైతులకు ఒకేచోట లేఅవుట్ అభివృద్ధి చేసి రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించే ఆలోచనలో సీఆర్డీఏ ఉన్నట్లు తెలిసింది. అమరావతి రాజధాని కోసం ఏపీ ప్రభుత్వం రెండో విడత భూసమీకరణ చేపడుతున్న సంగతి తెలిసిందే. ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల భూమిని రెండో విడతలో సమీకరించనున్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనుంది. అయితే తొలివిడతలో మాదిరిగా కాకుండా ఈసారి రైతులందరికీ ఒకేచోట రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనున్నట్లు సమాచారం. అమరావతి కేపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. రెండో విడత ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చే రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్డీఏ సింగిల్ లేఅవుట్ అభివృద్ధి చేయనున్నట్లు సమాచారం. ఈ దిశగా సీఆర్డీఏ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రతిపాదనకు ఆమోదం కోసం ప్రభుత్వానికి నివేదించనున్నారు. రాజధాని అమరావతి విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండో విడత భూసమీకరణ చేపడుతోంది. తొలి దశలో రైతులకు ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు ప్రతి గ్రామంలో లేఅవుట్లను అభివృద్ధి చేశారు. రైతులు తమ గ్రామాల్లోనే రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించాలని పట్టుబట్టడంతో ప్రభుత్వం.. వారి గ్రామాల్లోనే లేఅవుట్లను అభివృద్ధి చేశారు. అయితే ఈ నిర్ణయంతో లేఅవుట్ల అభివృద్ధి తర్వాత ప్రభుత్వానికి లభించిన భూమి వేర్వేరు ప్రాంతాలలో ఉండిపోయింది. పెద్ద కేటాయింపులు చేయడానికి ఒకే చోట పెద్ద మొత్తంలో భూమి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రభుత్వానికి సమస్యలు ఎదురయ్యాయి. మరోవైపు ఎక్కువ లేఅవుట్లు ఉండటం వల్ల ప్రతి లేఅవుట్‌కు ప్రత్యేక మౌలిక సదుపాయాలు అవసరమని, దీనివల్ల ఖర్చులు పెరుగుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే రెండో విడతలో భూములు అప్పగించే రైతులకు ఒకేచోట లేఅవుట్ అభివృద్ధి చేసి.. అందులోనే రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించే ఆలోచనలు చేస్తున్నారు. మరోవైపు ఒకే చోట ప్లాట్లు కేటాయించడం వల్ల ప్రభుత్వం సేకరించిన భూములు ఏకీకృతం అవుతాయని, అంతర్జాతీయ విమానాశ్రయం, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వంటి ప్రాజెక్టులకు కేటాయించడానికి అనుకూలంగా ఉంటాయని సీఆర్డీఏ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులకు ఒకే చోట భారీ భూమి అవసరమని అధికారులు చెప్తున్నారు. మరోవైపు అభివృద్ధి చేసిన ప్లాట్లను వెంటనే అప్పగించాలని రైతులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో.. ఒకే లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తే పనులు త్వరగా పూర్తి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచేందుకు సీఆర్డీఏ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు

# గుడివాడ రాజకీయాల్లో కొత్త సమీకరణలు..

విజయవాడ, జనవరి 20, (భారత శక్తి):

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు కీలక నేతగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ ప్రయాణం మరో మలుపు తీసుకుంటుందా అన్న చర్చ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. జగన్మోహన్ రెడ్డి పార్టీ స్థాపించిన తొలి రోజుల్లోనే తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పిన ఆయన, అప్పటినుంచి వైసీపీలోనే కొనసాగుతున్నారు. టీడీపీ తరపున గుడివాడ నియోజకవర్గాన్ని రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన అనుభవం ఉన్న నాని, వైసీపీలో చేరిన తర్వాత కూడా ఆ నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా ఎదిగారు. వైసీపీ తరపున మూడు ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన, రెండుసార్లు విజయాన్ని సాధించారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. అదే సమయంలో ఆయనకు ఆరోగ్య సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. గత ఏడాది కాలంగా హైదరాబాద్కే పరిమితమై, నియోజకవర్గంలో పెద్దగా కనిపించడం లేదు. సంక్రాంతి వంటి ముఖ్యమైన పండుగ సందర్భాల్లో కూడా గుడివాడకు రాకపోవడంతో, ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలు పెరిగాయి. కొడాలి నాని రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచే మొదలైంది. 2004, 2009 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా గెలిచినా, అప్పట్లో టీడీపీ అధికారంలోకి రాలేదు. అనంతరం పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో వైసీపీలో చేరిన ఆయన, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పై తీవ్ర విమర్శలు చేస్తూ వార్తల్లో నిలిచారు. కానీ తాజా ఎన్నికల ఫలితాలు, ఆరోగ్య పరిస్థితులు కలిసి ఆయనను కొంత వెనక్కి నెట్టినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ కార్యక్రమాలు నామమాత్రంగా కూడా జరగడం లేదన్న మాట వినిపిస్తోంది. పార్టీ తరపున స్థానికంగా చురుకైన నాయకత్వం లేకపోవడంతో, హైకమాండ్ కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. కొడాలి నాని స్థానంలో ఒక ప్రముఖ తెలుగు చిత్ర పరిశ్రమ నిర్మాతను తెరపైకి తెచ్చే యోచన ఉందని సమాచారం. సామాజిక సమీకరణలు, ఆర్థిక బలం దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నారనే చర్చ జరుగుతోంది.

# భారీగా ఎన్డీపిఎల్ మద్యం పట్టివేత

### రూ. 8.15 లక్షల విలువ చేసే 262 మద్యం బాటిళ్ల స్వాధీనం

### ఇద్దరిపై కేసు నమోదు..

### మద్యాన్ని తరలిస్తున్న ఆటో ట్రాలీ సీజ్

సికింద్రాబాద్ జనవరి 20,తక్కువ ధరల ముసుగులో వచ్చిన మద్యాన్ని తెచ్చి పోలీసులకు దొరికిపోయారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సిక్కు విలేజ్ లో ఇంపీరియల్ గార్డెన్ లో ఒక ఫంక్షన్ ఏర్పాటు చేశారు. వచ్చిన అతిథులందరికీ మద్యంతో విందు ఇవ్వడానికి అవసరమైన మందును తెలంగాణ మద్యం కాకుండా ఎన్ డి పి ఎల్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తక్కువ ధరలకు వస్తుందని కొనుగోలు చేసి ఫంక్షన్ను నిర్వహిస్తుండగా సోమవారం రాత్రి సికింద్రాబాద్ ఎక్సైజ్ సీఐ జగన్మోహన్ రెడ్డి సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి 261 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని తీసుకువచ్చిన ఆటో ట్రాలీ తో పాటు పాడేరు శ్రీధర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిర్వాహకుడికి సంబంధించిన వ్యక్తి శ్యామ్ జోసెఫ్ అనే అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిల్లో 44 ఏర్పోర్ట్ నుంచి తెచ్చిన డ్యూటీ ఫ్రీ మద్యం 23 మద్యం బాటిళ్లు గోవా నుంచి తెచ్చినటువంటివి 191 మద్యం బాలి బాటిల్స్ డిఫెన్స్ కు సంబంధించిన స్వాధీనం చేసుకున్నారు

# లిక్కర్ కేసు ఈడీ ఎంట్రీ...

## ఇక దబిడి దిబిడే

విజయవాడ, జనవరి 20, (భారత శక్తి):



.ఏపీ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి మారినట్లు స్పష్టం అవుతుంది. కేంద్రంలో ఎన్డీఏ అధికారంలో ఉంది. అక్కడ బిజెపి సారథ్యం వహిస్తోంది. ఏపీలో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నడుస్తోంది. ఈ రెండు చోట్ల పరస్పరం బిజెపి, టిడిపి కలిసి ముందుకు సాగుతున్నాయి. అయితే ఏపీ విషయానికి వస్తే ప్రతిపక్ష స్థానంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో బిజెపి ఉదాసీనంగా ఉందన్న టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఫుల్ క్లారిటీ ఇచ్చారు. కొన్ని రకాల వ్యాఖ్యానాలు చేశారు. బిజెపి వైఖరిని తేల్చి చెప్పారు. త్వరలో కొన్ని రకాల సంచలనాలు నమోదవుతాయని కూడా సంకేతాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి.మద్యం కుంభకోణం కేసును ఏపీ సిఐడి దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొంతమంది అరెస్టులు జరిగాయి. అందులో కొందరు బెయిల్ పై బయటకు వచ్చారు. అలానే సుప్రీంకోర్టు వరకు వెళ్లి అరెస్టును తప్పించుకోవాలని చూశారు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. కానీ ఆయనకు అవకాశం దక్కలేదు. అరెస్టు తప్పలేదు. ఎలాగోలా బెయిల్ పై బయటకు వచ్చారు మిథున్ రెడ్డి. కానీ అంతకంటే ముందే ఈ కేసులో నిందితుడిగా ఉన్నారు విజయసాయిరెడ్డి. ఆయన మాత్రం అరెస్ట్ కాలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన ఆయన ఈ కేసులో సహకారం అందించడం వల్లే అరెస్టు కాలేదని ప్రచారం జరిగింది. అయితే ఈ విషయంలో ఎంత వాస్తవం ఉందో తెలియదు కానీ.. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నేతలను ఇరకాటంలో పెట్టింది మాత్రం విజయసాయిరెడ్డి. ఇప్పుడు అదే విజయసాయి రెడ్డికి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ నుండి పిలుపు వచ్చింది. ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని ఈడి నోటీసులు ఇచ్చింది. అది గడవక ముందే ఈరోజు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి సైతం ఈడి నోటీసులు ఇచ్చింది. 23న విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొంది.అయితే ఇప్పటివరకు వైసీపీ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి భిన్న వైఖరితో ఉందన్న ప్రచారం సాగింది. గత స్నేహాన్ని దృష్టిలో పెట్టుకుని వైసీపీ విషయంలో కొంత మినహాయింపు వస్తుందని ఆ పార్టీ నేతలు భావించారు. అందుకే వైసిపి విమర్శలు కేవలం టిడిపి, జనసేనకు మాత్రమే పరిమితం అయ్యేవి. కానీ ఇప్పుడు ఈ డి మద్యం కుంభకోణం కేసులో ఎంట్రీ ఇచ్చింది.. నిందితులుగా ఉన్న వైసీపీ నేతలకు విచారణకు పిలిచింది. బిజెపి మారిన వైఖరిని ఇది స్పష్టం చేస్తోంది. సరిగ్గా ఇదే సమయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఈ కేసులో సంచలనాలు నమోదు కాబోతున్నాయని తేల్చి చెప్పారు. దీంతో పొలిటికల్ వర్గాల్లో విస్తృతమైన చర్చ నడుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వైసీపీలో కనిపిస్తున్న నిశ్శబ్దం

ఒంగోలు, జనవరి 20, (భారత శక్తి):

వైసీపీలో ఇటీవలి కాలంలో కనిపిస్తున్న నిశ్శబ్దం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. పార్టీ ఓటమి తర్వాత సాధారణంగా ఎదురుదాడి ఎక్కువగా ఉండాల్సిన సమయంలో, చాలా మంది కీలక నేతలు పూర్తిగా మౌనంగా ఉండటం ప్రశ్నలు లేవనెత్తుతోంది. కొందరు మాత్రమే మీడియా ముందుకు వచ్చి పార్టీ తరఫున మాట్లాడుతుండగా, మిగతావారు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు అన్నదే ఇప్పుడు ప్రధాన అంశంగా మారింది.పార్టీ పరిస్థితి కష్టంగా ఉన్నప్పుడు, బలమైన నాయకత్వం బయటకు వచ్చి కార్యకర్తలకు ధైర్యం ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. కానీ ప్రస్తుతం అలాంటి దృశ్యం పెద్దగా కనిపించడం లేదు. అవకాశాలు లేవంటే అర్థం చేసుకోవచ్చు. కానీ అవకాశం ఉన్నా కూడా చాలామంది నేతలు మీడియా ముఖం చూడకపోవడం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తిని పెంచుతోంది. పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దన్న అప్రత్యక్ష ఆంక్షలున్నాయా? లేక స్వచ్ఛందంగా మౌనం పాటిస్తున్నారా? అన్న సందేహాలు వినిపిస్తున్నాయి.ఒకప్పుడు రాయలసీమ వైసీపీకి బలమైన అడ్డాగా ఉండేది. అక్కడి నుంచి గట్టిగా పార్టీ వాయిస్ వినిపించేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారినట్టుగా కనిపిస్తోంది. కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మాత్రమే తరచుగా మీడియా ముందుకు వచ్చి స్పందిస్తున్నారు. మిగిలిన నేతలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఇది సీమ కార్యకర్తల్లో అయోమయాన్ని కలిగిస్తోంది.నెల్లూరు జిల్లా పరిస్థితి కూడా అంతే. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తన నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారన్న ప్రచారం తప్ప, జిల్లా స్థాయిలో పార్టీ తరఫున బలమైన ప్రకటనలు వినిపించడం లేదు. ఇతర నియోజకవర్గాల నేతలు కూడా ముందుకు రాకపోవడం గమనార్హం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అయితే వైసీపీ కార్యకలాపాలే కనిపించని స్థాయిలో నిశ్శబ్దం నెలకొంది.

విజయవాడ , ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో పేర్ని నాని (, దేవినేని అవినాష్ మాత్రమే అప్పుడప్పుడు మీడియా ముందు మాట్లాడుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి పార్టీ వాయిస్ దాదాపు వినిపించడం లేదు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు అవసరమైనప్పుడు మాత్రమే స్పందిస్తున్నారన్న అభిప్రాయం ఉంది.ఉత్తరాంధ్ర ప్రాంతంలో కూడా కొద్దిమందే కనిపిస్తున్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ , ధర్మాన సోదరులు అప్పుడప్పుడే మీడియా ముందుకు వస్తున్నారు. మొత్తం మీద చూస్తే, పార్టీ అంతర్గతంగా ఏదో అప్రకటిత నియంత్రణ నడుస్తోందా? లేక నాయకులే పరిస్థితిని గమనిస్తూ మౌనం పాటిస్తున్నారా? అన్న ప్రశ్నలు వైసీపీలో మరింత బలంగా వినిపిస్తున్నాయి. పార్టీ భవిష్యత్ దిశ ఏంటన్నది స్పష్టత రావాల్సిన సమయమిదే.

# పోలా... అదిరిపోలా...

తిరుపతి, జనవరి 20, (భారత శక్తి):

పెళ్లి కాని కుర్రాళ్ల కోసం ఓ ఊరిలో వినూత్న ప్రచారం మొదలైంది. పశువుల పండగ సందర్భంగా, కొందరు యువకులు తమ ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, తమకు పెళ్లికి సిద్ధంగా ఉన్న అమ్మాయిలు కావాలని కోరారు. స్టార్ మార్కులు పెట్టి మరీ ఈ ప్రకటన చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కొత్త తరహా ఆలోచన ఇప్పుడు సోషల్ మీడియాలోనూ, ఊరంతా హాట్ టాపిక్ అయ్యింది.పెళ్లి కాని అబ్బాయిలు ఏం చేస్తారు.. ఏ మ్యాట్రిమోని సైటో లేదా తెలిసిన వాళ్ల ద్వారా అమ్మాయిల్ని వెతుకుతారు. 'ఇలా మా ఇంట్లో అబ్బాయి ఉన్నాడు.. మంచి అమ్మాయి ఉంటే చూసి పెట్టండి.. మావాడికి పెళ్లి చేస్తాం' అంటూ చెబుతుంటారు. కానీ ఓ ఫ్లెక్సీ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 'మా ఊర్లో మంచి కుర్రాళ్లు పెళ్లికి సిద్ధంగా ఉన్నారు' అంటూ ఏకంగా వాళ్ల ఫోటోలతో అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చేశారు. ఆ ఫ్లెక్సీలో కనిపిస్తున్న యువకులకు.. మంచి వధువులు కావాలెను అని పెట్టి పెళ్లి కాని యువకులకు స్టార్ మార్క్ పెట్టారు. పండుగకు గ్రామానికి వచ్చే వారు ఈ ఫ్లెక్సీ చూసి షాక్ అయ్యారు.. ఆ అసలు విషయం తెలిసి నవ్వుకున్నారు.చిత్తూరు జిల్లా ఐరాల మండలంలోని కలికిరిపల్లెలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం పశువుల పండగ నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇందులో కొందరు యువకుల ఫోటోలపై స్టార్ గుర్తులు ముద్రించారు. ముఖ్య గమనిక.. స్టార్ గుర్తు కలిగిన యువకులకు వధువులు కావాలి అని ముద్రించడం కొసమెరుపు. దీన్ని చూసి ప్రతిఒక్కరూ ఇదేదో బాగుందని చర్చించుకున్నారు. వివాహాలు కానీ యువకులు కొత్త తరహా ప్రచారం చేయడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.

స్టార్ మార్కులతో.. సినిమా రేంజ్ బిల్డప్‌తో ఉన్న ఈ బ్యానర్లు చూసి గ్రామస్తులు ఏం ఐడియా రా బాబు అంటూ తెగ నవ్వుకుంటున్నారు. గ్రామీణ పండుగలో ఈ వినూత్న ఆలోచన ఇప్పుడు ఊరంతా హాట్ టాపిక్ అయ్యింది. యువకులు పెళ్లి సంబంధాల కోసం పండుగనే వేదికగా మార్చుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే, ఈరోజుల్లో అమ్మాయిలు డబ్బులు కాదు.. మంచి గుణవంతుడిని భర్తగా ఎంచుకోవాలని గ్రామస్థులు సూచిస్తున్నారు. సాధారణంగా ప్రత్యేకంగా ఏవైనా కార్యక్రమాలు, పుట్టిన రోజు, పెళ్లి వేడుకలు వంటి కార్యక్రమాల సందర్భంగా గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటారు. కానీ పెళ్లి కాని యువకులు ఇలా కొత్త తరహాలో ప్రచారం చేయడం హాట్‌టాపిక్ అయ్యింది.

# హరీష్ తో మొదలై... కేసీఆర్ తో ముగుస్తుందా

హైదరాబాద్, జనవరి 20, (భారత శక్తి):




సీఎం రేవంత్ రెడ్డి గులాబీ పార్టీ గద్దెలు మొత్తం కూలాలని ఇటీవల వ్యాఖ్యలు చేశారు. గులాబీ పార్టీని వంద మీటర్ల లోతులో పాతిపెట్టాలని పిలుపునిచ్చారు. ఆ వ్యాఖ్యలు ఏదో రాజకీయ వ్యవహారంలో చేసినవని అందరూ అనుకున్నారు. కానీ, ముఖ్యమంత్రి వ్యాఖ్యల వెనుక లోతైన వ్యవహారం ఉందని ఇప్పుడు అందరికీ అర్థమవుతోంది. ఖమ్మం సభలో రేవంత్ రెడ్డి ఆవేశంగా మాట్లాడారు. ఆ తర్వాత ఒక్కరోజు గ్యాప్ లోనే ఆ పరిణామాలు ఎలా ఉంటాయో గులాబీ పార్టీకి అర్థమైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం మరోసారి ఆక్టివ్ అయింది. ఈసారి మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేసింది. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయన విచారణకు హాజరు అయ్యారు. సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద ఆయనకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారులు ఎదుట హరీష్ రావు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఏసిపి వెంకటగిరి ఈ నోటీసులను హరీష్ రావుకు అందించారు.గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ టాపింగ్ జరిగిందని పదేపదే రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. చివరికి కేసీఆర్ కుమార్తె కూడా ఫోన్ టాపింగ్ జరిగిందని చెబుతున్నారు. తన భర్త ఫోన్ ను కూడా వదిలిపెట్టకుండా దుర్మార్గంగా వ్యవహరించారని కవిత ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఫోన్ టాపింగ్ వ్యవహారంపై వేగంగా అడుగులు వేస్తోంది. ఫోన్ టాపింగ్ వల్ల గత ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ప్రయోజనాలు పొందారు? నాటి ప్రభుత్వ పెద్దల కోసం పనిచేసిన వారు ఎలాంటి ఫలితాన్ని ఆశించారు? అనే విషయాలను బయట పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం కృషి చేస్తుంది.హరీష్ రావు కు సిట్ నోటీసు ఇవ్వడం సంచలనం కలిగించింది. ఈ కేసులో ముందుగా హరీష్ రావును, ఆ తర్వాత కేటీఆర్ ను, అనంతరం కేసీఆర్ ను విచారణకు పిలుస్తారని తెలుస్తోంది. విచారణ అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏం చేస్తుంది అనేది చూడాల్సి ఉంది. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే చాలామందిని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. విచారణలో సేకరించిన సమాచారం తర్వాత హరీష్ రావుకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. హరీష్ రావును విచారించి స్టేట్మెంట్ రికార్డు చేస్తారని తెలుస్తోంది.గతంలోనే తనకు నోటీసులు అందుతాయని హరీష్ రావు చెప్పారు.. పంచాయతీ ఎన్నికలకు ముందు ఫార్ములా ఈ కారు రేసులో కేటీఆర్ కు నోటీసులు ఇచ్చారని.. ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తనకు కూడా ఇస్తారని హరీష్ రావు చెప్పారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండదని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే అది జరుగుతుందని హరీష్ రావు గతంలోనే వ్యాఖ్యానించారు.. ఇక ఈ వ్యవహారంలో ముందు నుంచి కూడా కేసీఆర్ పేరు వినిపిస్తోంది. త్వరలోనే ఆయనను విచారిస్తారని.. దానికంటే ముందు నోటీసులు పంపిస్తారని ప్రచారం జరుగుతోంది.

# ఇండోర్ లో కాస్ట్లీ బిచ్చగాడు..

## రీల్ కాదు... రియల్

భోపాల్, జనవరి 20,(భారత శక్తి):



బిచ్చగాడు సినిమా చూశారా.. అందులో విజయ్ ఆంటోని బిచ్చం ఎత్తుకుంటూ జీవిస్తుంటాడు. అతడి దుస్థితిని చూసి చాలామంది బాధపడుతుంటారు. ఈ నేపథ్యంలోనే ఒకానొక సందర్భంలో విజయ్ ఆంటోని వెతుక్కుంటూ చాలామంది వస్తారు. అతడిని చూసి వాహనాల శ్రేణిని ఆపుతారు. ఆ తర్వాత విజయ్ ఆంటోని ఆ కారులోకి ఎక్కుతాడు. చూసేందుకు ఆ సన్నివేశం చాలా అద్భుతంగా ఉంటుంది. ఇటువంటివి రీ లైఫ్ లో మాత్రమే సాధ్యం. రియల్ లైఫ్ లో పాసిబుల్ కావు. కానీ దీనిని నిజం చేసి చూపించాడు ఈ వ్యక్తిమన దేశంలో శుభ్రమైన నగరంగా పేరుపొందిన ఇండోర్ లో ఓ వ్యక్తి యాచకుడిగా జీవిస్తున్నాడు. కాకపోతే అతడు కూటికి గతి లేని వాడు కాదు. గుడ్డకు దిక్కులేనివాడు కాదు. అతడికి ఏకంగా మూడు నివాసాలు ఉన్నాయి. అంతకుమించి అనే స్థాయిలో కార్లు ఉన్నాయి. ఇక ఆటోల గురించి చెప్పాల్సిన పనిలేదు. వడ్డీ వ్యాపారం.. భారీగా బంగారం.. ఇలా చెప్పుకుంటూ పోతే అతడు అత్యంత ఖరీదైన బిచ్చగాడు. ఇటీవల మధ్యప్రదేశ్ ప్రభుత్వం బెగ్గర్ ఎరాడికేషన్ క్యాంపియన్ నిర్వహించింది. ఇందులో అతనికి సంబంధించిన వివరాలు బయటపడ్డాయి.మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడమేనక బలమైన కారణం ఉంది. వీధుల్లో యాచక వృత్తి చేసుకుంటూ జీవించేవారికి ప్రభుత్వం తరఫున ఆర్థికంగా భరోసా కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో యాచించుకుంటూ జీవిస్తున్న మంకీలాల్ అనే వ్యక్తి పై ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. అతడికి పునరాగం కల్పించడానికి ప్రయత్నాలు చేశారు. అయితే వారు అనుకున్నట్టుగా మంగీలాల్ కూటికి గతి లేనివాడు కాదు. అతడికి భారీగా ఆస్తులు ఉన్నాయి.అధికారుల పరిశీలనలో మంగీలాల్ ఆస్తులు కోట్లల్లో ఉన్నాయి. మంగీలాల్ వద్ద 600 స్వేర్ ఫీట్ సామర్థ్యంతో భగత్ సింగ్ నగర్, శివనగర్, అల్వాస్ అనే ప్రాంతాలలో మూడు నివాసాలు ఉన్నాయి. మూడు ఆటోలు, స్విఫ్ట్ డిజైర్ కార్లు ఉన్నాయి. ఆ కారు నడపడం కోసం మంగీలాల్ ఒక డ్రైవర్ ను కూడా నియమించుకున్నాడు. తను ఈ యాచించడానికి ఎక్కడికి వెళ్లాలన్నా ఆ కారులోనే ప్రయాణ సాగిస్తుంటాడు. ఖాళీ సమయంలో మాత్రం అద్దెకు తిప్పుతుంటాడు. మరోవైపు మంగిలాల్ కోసం మహారాష్ట్ర ప్రభుత్వం 1బిహెచ్కే ఇల్లు కేటాయించింది. అయినప్పటికీ అతడు బిచ్చం ఎత్తుకోవడాన్ని. చెక్కతో చేసిన ఒక కార్డు పట్టుకొని ఇండోర్ నగరంలో యాచిస్తున్నాడు. అంతేకాదు సరఫ బజార్ ప్రాంతంలో ఫైనాన్స్ వ్యాపారం కూడా చేస్తున్నాడు.

# ఎగుమతుల స్థాయికి రక్షణ రంగం...

న్యూఢిల్లీ, జనవరి 20, (భారత శక్తి):

భారతదేశం యుద్ధాల్లో మందుగుండుల కొరతను ఎదుర్కొన్న అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, ఇప్పుడు స్వయం సమృద్ధి వైపు గబగబా దూసుకుపోతోంది. కార్గిల్, 1962, 1965 వంటి సంఘటనలు విదేశాలపై ఆధారపడడం మన లోపాలను బయటపెట్టాయి. ఇప్పటికే గణనీయ పురోగతి సాధించిన ఈ మార్పు దేశ భద్రతను బలోపేతం చేస్తోంది1999లో కార్గిల్ యుద్ధంలో ఆర్టిలరీ షెల్స్ కొరత ఇజ్రాయెల్, సౌత్ ఆఫ్రికా సహాయాన్ని అవసరం చేసింది. ఇజ్రాయెల్ 160 ఎంఎం షెల్స్ సరఫరా చేసింది, సౌత్ ఆఫ్రికా మూడు నెలల పోరాటానికి సహకారం అందించింది. 1962 చైనా యుద్ధంలో అమెరికా సహాయం లేకపోతే పరిస్థితి మరింత తీవ్రమవుతే అని నిపుణులు అంచనా. 1965 యుద్ధంలో ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి సైన్యాధినేత జేఎన్ చౌదరిని ప్రశ్నించగా, 15 రోజుల సామగ్రి మాత్రమే ఉందని తెలిపారు. ఇది తాష్కెంట్ ఒప్పందానికి దారితీసింది. 200 రకాల మందుగుండులకు విదేశీ మార్గాలపైనే ఆధారపడటం దీర్ఘకాలిక ఇబ్బందులకు కారణమైంది.2024 జాతీయ రక్షణ విధానం స్వదేశీ ఉత్పత్తిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలు దీనికి బలం చేకూర్చాయి. 2024?25లో 1.54 లక్షల కోట్ల రూపాయల విలువైన ఆయుధ సామగ్రి ఉత్పాదకం చేశాం, 2029కి 3 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యం. 159 పరికరాల ఉత్పత్తిలో 90 శాతం స్వయం సమృద్ధి సాధించాం. ఏకే?47 తూటాల కోసం ఇటీవల అమేథీలో కర్మాగారం ప్రారంభించాం. ఇది కార్గిల్ లాంటి సందర్భాల్లో విదేశీ సహాయాల అవసరాన్ని తొలగిస్తుంది.

2014లో 640 కోట్ల రూపాయల ఎగుమతుల నుంచి గతేడాది 23,622 కోట్లకు చేరాం, 34 శాతం వృద్ధి సాధించాం. బ్రహ్మోస్, మిస్సైల్స్, రక్షణ వ్యవస్థలు సహా 10 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు విదేశాలకు సరఫరా అవుతున్నాయి. ఈ పురోగతి దేశ ఆర్థిక, కాగార్థిక బలాన్ని పెంచుతోంది. దీర్ఘయుద్ధాల్లో కూడా స్వయం సమృద్ధితో ధైర్యం కలుగుతుంది.ఆత్మనిర్భరత విదేశీ ఆధారాలను తగ్గించి, రక్షణ రంగాన్ని గ్లోబల్ గేమ్ చేంజర్‌గా మార్చింది. పదేళ్లలో మరింత అధునాతన సాంకేతికతలు, ఎగుమతులు దేశ భద్రతను అద్భుతంగా బలపరుస్తాయి. ఇది యుద్ధాల చరిత్రను మార్చే మైలురాయి.

# పూరికి కలిసి రాని కాలం

హైదరాబాద్, జనవరి 20,(భారత శక్తి):

బద్రి సినిమాతో దర్శకుడి గా తన కెరియర్ ను స్టార్ట్ చేసిన డైరెక్టర్ పూరి జగన్నాథ్?బద్రి మూవీ ఇచ్చిన సక్సెస్ తో తనకంటూ ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకున్నాడు. వరుసగా సినిమాలను చేస్తూ స్టార్ డైరెక్టర్ గా ఎదిగాడు. ప్రస్తుతం ఇండస్ట్రీ లో ఉన్న స్టార్ హీరోలందరికి ఆయన సక్సెస్ లను అందించాడు. స్టార్ హీరోల అభిమానులకు కూడా పూరి జగన్నాథ్ అంటే రెస్పెక్ట్ పెరిగింది. చాలామంది హీరోల అభిమానులు సైతం అతని ఫ్యాన్స్ గా మారిపోయారు. అలాంటి పూరి జగన్నాథ్ గత కొద్దిరోజుల నుంచి సరైన సక్సెస్ ని సాధించడంలో తడబడుతున్నాడు. ఇక ప్రస్తుతం విజయ్ సేతుపతితో చేస్తున్న 'స్లమ్ డాగ్' సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. ఇక ఈ సినిమా విజయ్ సేతుపతికి అనుకున్న విజయాన్ని సాధించి పెడుతుందా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే?ఈ సినిమాతో సక్సెస్ వస్తేనే పూరి జగన్నాథ్ కి స్టార్ హీరోల నుంచి అవకాశాలు వచ్చే ఛాన్సులైతే ఉన్నాయి. ఒకవేళ ఈ సినిమా తేడా కొడితే మాత్రం పూరి జగన్నాథ్ షెడ్డు కి వెళ్లి పోవాల్సిందే అంటూ మరి కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా అతను ఇంతకుముందు ఎలాగైతే కసిగా సినిమాలు తీసేవాడో అలాంటి కసి ఇప్పుడు కనిపించడం లేదు.ఒకవేళ ఆయన మరోసారి అలా ఫోకస్ తో సినిమాలను చేస్తే ఇప్పటికి కూడా సూపర్ సక్సెస్ లను సాధించే అవకాశం ఉంది. నిజానికి అతని కంటే తక్కువ టాలెంట్ ఉన్నవారు సైతం సినిమాలను ఈజీగా సక్సెస్ ఫుల్ గా నిలుపుతున్నారు. పూరి జగన్నాథ్ కేవలం సినిమా మీద ఫోకస్ చేయకపోవడం వల్లే అలా ఆయన సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి అంటూ మరికొంతమంది కామెంట్లు చేస్తున్నారు?ఏది ఏమైనా కూడా పూరి జగన్నాథ్ మరోసారి రాణించాలి అంటే మాత్రం స్లమ్ డాగ్ సినిమాతో తప్పకుండా సూపర్ సక్సెస్ ని సాధించాలి. అది ఏ మాత్రం తేడా కొట్టిన కూడా అతని కెరియర్ అనేది ముగిసిపోవడం పక్కా అంటూ మరి కొంతమంది కామెంట్లు చేస్తున్నారు?

# అమెరికాలో లీడర్‌షిప్ పాఠాలు నేర్చుకోనున్న సీఎం

హైదరాబాద్, జనవరి 20, (భారత శక్తి):



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో '21వ శతాబ్దం కోసం నాయకత్వం' అనే ప్రత్యేక కోర్సులో చేరనున్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు తర్వాత, జనవరి 25 నుంచి 30 వరకు జరిగే ఈ ఇంటెన్సివ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటారు. క్లిష్టమైన సమస్యల పరిష్కారం, ప్రజలను ప్రభావితం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఉంటుంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థిగా కొత్త అవతారం ఎత్తనున్నారు. క్లాసులకు వెళ్లి శ్రద్ధగా పాఠాలు విననున్నారు. విజ్ఞాన సముపార్జన కోసం ఆయన మళ్లీ స్టూడెంట్‌గా మారాలని నిర్ణయించుకున్నారు. అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ వేదికగా నిర్వహించే '21వ శతాబ్దం కోసం నాయకత్వం' అనే ప్రత్యేక కోర్సులో ఆయన చేరనున్నారు. మేడారం పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో కాసేపటి క్రితం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరారు. అక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ముగిసిన అనంతరం.. జనవరి 23న ఆయన నేరుగా అమెరికాకు వెళ్తారు. మసాచుసెట్స్‌లోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ క్యాంపస్‌లో జనవరి 25 నుంచి 30 వరకు జరిగే స్పెషల్ క్లాసులకు రేవంత్ రెడ్డి హాజరవుతారు. వారం రోజుల పాటు సాగే ఈ ఇంటెన్సివ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ ముగిసిన తర్వాత.. యూనివర్సిటీ నుంచి సర్టిఫికేట్ అందుకుని ఫిబ్రవరి 2న తిరిగి హైదరాబాద్ చేరుకుంటారుహార్వర్డ్ కెన్నెడీ స్కూల్-ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ విభాగం ఈ కోర్సును అత్యంత అనుభవజ్ఞులైన నాయకుల కోసం రూపొందించింది. ఇది కేవలం సిద్ధాంతాలకు పరిమితం కాకుండా.. నిజ జీవితంలో ఎదురయ్యే క్లిష్టమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తుంది. అనిశ్చిత పరిస్థితులు, రాజకీయ మార్పులు, విభేదాలను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి? కేవలం అధికారం ద్వారా కాకుండా.. పనితీరు, వ్యక్తిత్వంతో ప్రజలను ఎలా ప్రభావితం చేయాలి ప్రజలను కొత్త ఆలోచనల వైపు, సామాజిక మార్పు వైపు ఎలా ప్రేరేపించాలి ? అంశాలపై ప్రత్యేక తరగతులు ఉంటాయి. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కేస్ స్టడీస్, గ్రూప్ డిస్కషన్స్, రియల్-లైఫ్ లీడర్‌షిప్ సవాళ్లపై లోతైన విశ్లేషణ ఉంటుంది.రాజకీయ నాయకులు, ప్రభుత్వ సీనియర్ అధికారులు, అంతర్జాతీయ కంపెనీల సీఈవోలకు మాత్రమే ఈ కోర్సులో ప్రవేశం ఉంటుంది. ఈ తరహా శిక్షణ ద్వారా రాష్ట్ర పాలనలో మరిన్ని వినూత్న మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వ్యక్తిగత నాయకత్వ శైలిని ఆత్మపరిశీలన చేసుకునేందుకు.. అంతర్జాతీయ స్థాయి నాయకులతో నెట్‌వర్కింగ్ పెంచుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడనుంది. ఇండియా నుంచి ఈ తరహా కోర్సుకు ప్రత్యక్షంగా హాజరై అభ్యసించనున్న తొలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే కావడం గమనార్హం. కోర్సు ముగిశాక సీఎం రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్‌కు ఫిబ్రవరి 2న చేరుకోనున్నారు.

# నేటి నుండి 24 వ తేదీ వరకు మరియు 28,29 వ తేదీలలో జరుగు జేఈఈ మెయిన్ పరీక్షల నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయండి: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప,జనవరి 20(భారత శక్తి):

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారిచే నిర్వహిస్తున్న కంప్యూటర్ బేసిడ్ పరీక్షలలో జేఈఈ మెయిన్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా సచివాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశం మందిరం నందు జేఈఈ మెయిన్స్ పరీక్షల నిర్వహణ కు సంబంధించి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈనెల 21 నుండి 24 వరకు మరియు 28,29 తేదీలలో నిర్వహించే పరీక్షల నిర్వహణ లో భాగంగా వైయస్సార్ కడప జిల్లా నందు 4 పరీక్ష కేంద్రాలు కలవని తెలిపారు.

పరీక్షా కేంద్రాల వివరాలు×

1.కందుల ఓబుల్ రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కడప

2.కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కడప

3.కేఎల్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్, కడప

4.సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ప్రొద్దుటూరు..

పరీక్షా కేంద్రాల పరిధిలో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, ఈ పరిధిలో అన్ని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, , పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు.పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు

ఈ సమావేశంలో డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మనీష్ మీనా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయండి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప,జనవరి 20(భారత శక్తి) :

77వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఏఎస్పీ ప్రకాష్ బాబు లతో కలసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబందిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమానికి హాజరైన వారికి తాగునీటిని సరఫరా,మొబైల్ టాయిలెట్ల ను ఏర్పాటు చేయాలని కడప మునిసిపల్ కమిషనర్ ను ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్ళను ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ, డ్వామా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, జల వనరుల శాఖ, వ్యవసాయము, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, డియంహెచ్ఓ తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉదయం పెరేడ్ మైదానంలో, సాంస్కృతిక కార్యాక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండువగా సాగేలా సంసిద్ధం చేయాలని డీఈవోను ఆదేశించారు. పెరేడ్ మైదానంలో రంగు కాగితాలు, పూల అలంకరణ తో శోభాయమానంగా తీర్చిదిద్దాలన్నారు.ముఖ్యంగా ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడానికి సంబంధిత ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు అందించాలని ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీసుల మార్చి ఫాస్ట్ లో ఎన్ సిసి కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కె ఎంసి కమిషనర్ మానోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జడ్పి సీఈఓ ఓబులమ్మ,సిపిఓ హాజరతయ్య, డిఎంహెచ్ఓ డా. నాగరాజు,గృహనిర్మాణ శాఖ పీడి రాజరత్నం, డిఆర్డీఏ,మెప్మా పిడీలు రాజ్యలక్ష్మి,కిరణ్ కుమార్, డిపిఓ రాజ్యలక్ష్మి, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ అధికారులు, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 23, 24, 25 తేదీల్లో ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



వైఎస్ఆర్ కడప, జనవరి 20(భారత శక్తి) : జనవరి 23, 24, 25 తేదీల్లో జిల్లాలో జరగనున్న దీనీ ఇజ్తెమా కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ఇస్తేమా కార్యక్రమ నిర్వహణా ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి అత్యంత ప్రాధాన్యతతో ఈసారి కడప జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఈ నెల 23,24,25 తేదీల్లో కడప సమీపంలోని కొప్పర్తి పారిశ్రామిక వాడ వద్ద 350 ఎకరాల విస్తీర్ణంలో జరిగే ఈ కార్యక్రమాన్ని కార్యవర్గ కమిటీ సభ్యులు అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి త్రాగునీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ, బ్యారికెట్స్ తదితర మౌలిక అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఏ ఎస్పీ ప్రకాశ్ బాబు, కడప ఆర్డీవో జాన్ ఐర్విన్, ఏపి ఐఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, డిపివో రాజ్యలక్ష్మి, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ రమణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఆర్ అండ్ బి ఎస్ఈ జి.చంద్రశేఖర్ తదితర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జియోట్యాగింగ్‌తో తప్పిపోయిన వారి చెక్

వరంగల్, జనవరి 20, (భారత శక్తి):



దక్షిణ భారత కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈసారి సరికొత్త సాంకేతిక సొబగులను అద్దుకుంటోంది. ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహా జాతర కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ముందెన్నడూ లేని విధంగా కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానాన్ని వినియోగించుకోనున్నాయి. భద్రతా ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, జాతర ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు.జాతరలో భద్రతను పర్యవేక్షించేందుకు 'మేడారం 2.0'లో భాగంగా 'టీజీ-క్వెస్ట్' అనే అత్యాధునిక ఏఐ డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దాదాపు 30 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన దట్టమైన అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీగా ఉండే రహదారులపై ఈ డ్రోన్లు నిరంతరం నిఘా ఉంచుతాయి. కేవలం డ్రోన్లే కాకుండా.. ఆకాశంలో ఎగిరే హీలియం బెలూన్లకు పాన్-టిల్ట్-జూమ్ కెమెరాలను అమర్చారు. ఇవి అత్యంత ఎత్తు నుంచి కూడా రద్దీని విశ్లేషించి, తొక్కిసలాట జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే పసిగట్టి అధికారులను అప్రమత్తం చేస్తాయి. దాదాపు 13 వేల మంది పోలీసు సిబ్బంది ఈ అత్యాధునిక నిఘా నీడలో విధులు నిర్వహించనున్నారు.గత జాతరలో సుమారు 30 వేల మంది వరకు తప్పిపోయిన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈసారి వొడాఫోన్-ఐడియా సహకారంతో 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' వ్యవస్థను సిద్ధం చేశారు. పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్లలో వృద్ధులు, పిల్లల వివరాలను నమోదు చేసి వారికి క్యూఆర్ కోడ్ కలిగిన జియోట్యాగ్‌లను కడతారు. ఒకవేళ ఎవరైనా తప్పిపోతే, ఈ ట్యాగ్‌ను స్కాన్ చేయడం ద్వారా వారి పూర్తి వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలో అమలు చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తమిళ భాషల్లోనూ వివరాల నమోదుకు అవకాశం కల్పించారు.జాతరలో శాంతిభద్రతల కోసం 12 ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ప్రాంగణాలు, పార్కింగ్ స్థలాల వద్ద ముఖ గుర్తింపు సాంకేతికత ద్వారా పాత నేరస్థులను ఇట్టే పసిగట్టవచ్చు. అలాగే అనుమానాస్పద వస్తువులను గుర్తించే రియల్-టైమ్ అలర్ట్ సిస్టమ్‌ను కూడా సిద్ధం చేశారు. భక్తుల సౌకర్యార్థం 2,000 ఎకరాల్లో 37 పార్కింగ్ ప్రదేశాలు, 50కి పైగా అనౌన్స్‌మెంట్ పాయింట్లు అందుబాటులో ఉంటాయి. సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ గద్దెల ప్రాంగణాన్ని పునఃప్రారంభించి, పైలాన్‌ను ఆవిష్కరించారు. కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతలను దర్శించుకున్న సీఎం.. తన మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వనదేవతల దర్శనం ప్రశాంతంగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# కమిషనర్ బిడ్డగా పాలనపై పట్టు!

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, భారత శక్తి, జనవరి 20:

వార్డు సమస్యల మూలాలు తెలిసిన వ్యక్తి మునిసిపల్ యంత్రాంగంపై పట్టున్న శక్తి. తండ్రి పాలనలో పాఠాలు నేర్చి ప్రజా సేవలో అడుగులు వేస్తోంది సోనియా. మంథని ముప్పైవ వార్డు ముఖచిత్రం మారాలంటే కారు చీకట్లు పోయి హస్తం వెలుగులు రావాలి. ఉన్నత చదువుల విజ్ఞానం, అంకితభావం కలిసిన ఈ నాయకత్వం అజేయం. కమిషనర్ తనయగా సమస్యల పరిష్కారం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ప్రత్యర్థుల ఎత్తుగడలకు పైఎత్తు వేస్తూ ఈసారి ఓటు కేవలం వ్యక్తికో, పార్టీకో కాదు.వార్డు ఉజ్వల భవిష్యత్తు కోసం.ఆమెకు టికెట్ ఇస్తేముప్పైవ వార్డులో కాంగ్రెస్ విజయం చారిత్రక సాక్ష్యం. రాజకీయాల్లోకి ఎంతోమంది వస్తుంటారు, పోతుంటారు. కానీ, పాలనపై అవగాహన ఉన్నవారు వస్తేనే ఆ ప్రాంతం బాగుపడుతుంది. సోనియా మంథని తండ్రి భైంసా మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో పట్టణం ఎంతో అభివృద్ధి చెందింది. ఆయన పనుల తీరును, ఫైళ్ల కదలికను, ప్రజల సమస్యలను పరిష్కరించే విధానాన్ని చిన్నప్పటి నుండి దగ్గరగా గమనించిన సోనియా కి ఒక వార్డును ఎలా తీర్చిదిద్దాలో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తండ్రి నేర్పిన క్రమశిక్షణ, పాలనా మెలకువలే నేడు ఆమెను ఒక సమర్థవంతమైన నాయకురాలిగా తీర్చిదిద్దాయి.

విజ్ఞానంతో కూడిన విప్లవాత్మక మార్పు: నేటి ఆధునిక కాలంలో సమస్యలు కూడా జటిలమవుతున్నాయి. వాటిని పరిష్కరించడానికి పాత పద్ధతులు సరిపోవు. ఉన్నత విద్యను అభ్యసించిన మంతెన మంథని, ఆధునిక ఆలోచనలతో వార్డును అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఆమె భర్త కూడా సాంకేతిక రంగంలో స్థిరపడటం వల్ల, వార్డులో డిజిటల్ సేవలు, పారదర్శకమైన పాలన అందించే అవకాశం ఉంది. చదువుకున్న వారు రాజకీయాల్లోకి వస్తేనే వ్యవస్థలో మార్పు వస్తుందని నమ్మే ఓటర్లకు సోనియా ఒక ఆశాదీపంలా కనిపిస్తున్నారు. ముప్పైవ వార్డులో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఈసారి అత్యవసరం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బిఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టగల శక్తి ఒక్క సోనీకే ఉంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారైతే, కాంగ్రెస్ పార్టీకి ఒక క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకురాలు దొరికినట్లవుతుంది. ఓటర్లు కూడా "కమిషనర్ బిడ్డ" అనే నమ్మకంతో ఆమె వైపు మొగ్గు చూపుతున్నారు. తన తండ్రి హయాంలో జరిగిన పనులను గుర్తు చేస్తూ, తాను అంతకంటే మెరుగ్గా చేస్తానని ఆమె ఇస్తున్న భరోసా సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది.సామాజిక సమీకరణాలు: 30వ వార్డు 'జనరల్' రిజర్వేషన్ కావడం సోనియా మంథని ఒక అద్భుత అవకాశం. అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యే గుణం ఆమె సొంతం. మంతెన కుటుంబంపై పట్టణంలో ఉన్న గౌరవం ఓట్లుగా మారుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా మహిళలు, యువత ఆమె నాయకత్వాన్ని బలపరుస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల నాయకులు కూడా ఆమె అభ్యర్థిత్వాన్ని చూసి ఆత్మరక్షణలో పడ్డారు. సోనీ రంగంలో ఉంటే ప్రచారం కూడా సులభమవుతుంది, ఎందుకంటే ఆమె పేరు వినగానే ఒక భరోసా కలుగుతుంది. ముప్పైవ వార్డు ఓటర్లు ఇప్పుడు ఒక నిర్ణయాత్మకమైన దశలో ఉన్నారు. అభివృద్ధి చేసే నాయకురాలు కావాలా లేక విమర్శలు చేసే వారు కావాలా అని ఆలోచిస్తున్నారు. మంతెన సోనీ వంటి విద్యావంతురాలు, అనుభవం ఉన్న కుటుంబ నేపథ్యం గల వ్యక్తి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తే, ఆ విజయం కేవలం ఆ పార్టీకి మాత్రమే కాదు, మొత్తం వార్డు ప్రజల విజయమవుతుంది.



అధికార పార్టీ అందడండలతో, తండ్రి అనుభవంతో ఆమె వార్డును సుందరంగా తీర్చిదిద్దగలరు.


## జీవితానికి దిశానిర్దేశం చేసే అదృశ్య శక్తి నాన్న

అలుపెరుగని ప్రయాణం నాన్న
కుటుంబం కోసం నిరంతరం కృషి
చేస్తూ కన్నీటిని దిగమింగుతూ
మన నవ్వుల కోసం శ్రమించే
నిత్య శ్రామికుడు నాన్న
పైకి కనిపించని కన్నీటి సముద్రం
బాధలెన్ని ఉన్న లోపల దాచుకున్న
బాధ్యతల పర్వతం నాన్న
ఎండలో ఎండుతూ నీడనిచ్చే
చెట్టునాన్న
చీకటిలో వెలుగును చూపే
ధైర్యం దివిటీ నాన్న
కష్టాలను చిరునవ్వుతో
భరించే యోధుడు
త్యాగానికి అర్థం నాన్న
ప్రేమకు రూపం నాన్న
తనను తాను కరిగించుకొనే
కొవ్వత్తి లాంటి వాడు నాన్న
కొవ్వొత్తి కరుగుతూ వెలుగును
పంచి చీకటిని తొలిగిస్తుంది
తన సుఖాలను త్యాగం చేస్తూ
కుటుంబ ప్రగతికి పరితపించే
వాడు నాన్న
నాన్నా అంటే భద్రత
నాన్న అంటే నమ్మకం
నమ్మకాన్ని నూరిపోసిన
ఆయుదం నాన్న
నాన్న అంటే ఒక ధైర్యం
నాన్న అంటే ఒక రక్షకుడు

నాన్న తోనే జీవితం
అడుగులు నేర్పి అణుకువ
ఆర్ధత ఆత్మీయత ఆదరణ
అనురాగాలు రంగరించి
బంధాలను అనుబంధాలను
పెంచింది పంచింది నాన్న
లక్ష్యసాధనలో విఫలమైనప్పుడు
విజయాల బాటలో నడవడానికి
సంకల్ప బలాన్ని ప్రేరేపించి
శక్తి సామర్థ్యాలను మేల్కొలిపే
చైతన్య శక్తి నాన్న
మమత మానవీయత మర్యాదలు
నేర్పిన తొలి గురువు నాన్న జీవిత
సత్యాలను బోధిస్తాడు
జీవితానికి దశ దిశ నాన్న
అమ్మ నవమాసాలు మోసి
జన్మనిస్తే ఆ జన్మకు ఒక అర్థాన్ని
ఇచ్చే వాడునాన్న
తను అరిగిపోతూ మనల్ని
తీర్చిదిద్దే ఓ అపురూపమైన
చందనపు చెక్క నాన్న
ఓటమి ఎదురైనపుడు నేను
ఉన్నాననే వెన్ను తట్టే ధైర్యం
గెలుపు పిలుపులో గర్వంగా
తలెత్తుకునే కీర్తి చిహ్నం
కష్టాలకు ఎదురు నిలబడి
మనల్ని ఒడ్డుకు చేర్చే ధైర్యపు
వారిది నాన్న
పైకి ప్రేమించకపోయినా
గుండె నిండా మన గురించి
తపించే హృదయానికి
నిలువెత్తు నిదర్శనం
మన ఎదుగుదల వెనుక ఉన్న
మూల స్తంభం నాన్న

నాన్న అంటే కేవలం ఒక వ్యక్తి కాదు
ప్రతి కొడుకు/బిడ్డ జీవితానికి
దిశానిర్దేశం
చూపే అదృశ్య శక్తి
నాన్నను ఆదరిద్దాం ఉన్నత
స్థాయిలో రాణించి ఉత్తమ
పౌరునిగా ఎదిగి
నాన్న ఆశయాలు సాధిద్దాం
సమాజానికి ఆదర్శంగానిలుద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
1)తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
2)తెలంగాణ ఎకనామిక్ ఫోరం
3)మాజీ కరెస్పాండెంట్ జస్టిస్
కుమారయ్య లా కాలేజీ
కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ కుమారయ్య 1969బి 1971)
కరీంనగర్9440245771



## ఇస్తేమా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..!

వైయస్ ఆర్ కడప,జనవరి 20(భారత శక్తి) :

జనవరి 23, 24, 25 తేదీలలో జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి "శుభే ఆంధ్రాకే ఖురానోకా దీనీ ఇజ్తెమా" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్ల ను చేస్తున్నామని జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్.సవిత పేర్కొన్నారు



మంగళవారం వైయస్ ఆర్ కడప జిల్లా... సికె దిన్నె మండలం కొప్పర్తి పారిశ్రామిక వాడ లో జనవరి 23, 24, 25 వ తేదీలలో నిర్వహించే ఇస్తేమా కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్ల పై జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత,రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్,జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్,కమలా పురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి..లతో కలిసి అధికారులు, కార్యవర్గ సభ్యులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ×జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్.సవిత మాట్లాడుతూ...× మైనార్టీ సోదరులు నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమం ను మైనార్టీ సోదరులు ఎంతో నిజాయితీగా, సేవాభావంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని,ఇది చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసి చేసుకునే అతి పెద్ద మైనార్టీ పండుగ గా ఈ ఇస్తేమా ఉంటుందన్నారు. గౌ. ముఖ్యమంత్రి గారు ఈ కార్యక్రమం ను అత్యంత ప్రాధాన్యత గా తీసుకొని,ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ఆదేశించారని, ఈ నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ స్థానిక శాసనసభ్యులు పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారనన్నారు..ప్రభుత్వం అన్ని విభాగాల ద్వారా అవసరమైన వసతులు, త్రాగునీరు, రోడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు ఏర్పాటు చేసిందని.100 పడకల ఆసుపత్రి, 350 మంది పారిశుధ్య కార్మికులు, బస్సు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారని,మైనార్టీలను గౌరవించే కూటమి ప్రభుత్వం సహకారంతో ఈ కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేయాలన్నారు

ఈ సందర్భంగా ×రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ మంత్రి మాట్లాడుతూ..× గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు మైనారిటీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు.మూడు రోజులు పాటు జరిగే ఇస్తేమా కార్యక్రమానికి ఆంధ్రా, తెలంగాణ నుండి కూడా పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు రావడం జరుగుతుందనన్నారు. ముఖ్యంగా ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి రోడ్ మ్యాపు, త్రాగునీరు, విద్యుత్, మెడికల్,ట్రాఫిక్, బందోబస్తు,ఫైర్ సేఫ్టీ, బ్యారికెట్స్ వంటి తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఇస్తేమా కార్యక్రమం ప్రశాంత వాతావరణం లో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలనన్నారు

జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...

ఇస్తేమా కార్యక్రమ నిర్వహణ కు ఇది వరకే తీసుకున్న నిర్ణయం ప్రకారం అందరూ అంగీకరించిన ప్రణాళిక ను అనుసరించి వివిధ రకాల పనులను చేపట్టడం జరిగిందని,ఈ పనులు దాదాపుగా పూర్తయ్యాయని మిగిలిన పనులను బుధవారం లోపు పూర్తి దశకు చేరుకునే స్థితిలో ఉన్నాయన్నారు ముఖ్యంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా త్రాగునీటి సరఫరా, ట్రాన్స్‌కో ద్వారా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా కమిటీకి సహకారంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 4 తాత్కాలిక ఆసుపత్రులు, 4 అంబులెన్సులు ఏర్పాటు చేసి,డాక్టర్లు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే తాత్కాలిక మరుగుదొడ్ల నిర్వహణ తో పాటు భద్రత కోసం సీసీ కెమెరా లను కూడా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు

జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ...

ఇస్తేమా కార్యక్రమ నిర్వాహకులతో పోలీస్ శాఖ సమన్వయంతో సెక్యూరిటీ మరియు సేఫ్టీ ప్లాన్‌ను రూపొందించడం జరిగింది. ఇందులో ట్రాఫిక్ సెక్టార్ నుంచి రూట్ క్లియరెన్స్ వరకు సెక్టర్ వారీగా విభజించి ప్రణాళిక అమలు చేయబడుతుందనన్నారు.. సమావేశం నిర్వహించే ప్రాంతాన్ని భద్రత మరియు సురక్షిత దృష్టి కోణంతో నిర్వహించడంతో పాటు, పార్కింగ్ స్థలాలను కూడా పూర్తిగా ఎంపిక చేయడం జరిగిందని, అదే విధంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేస్తామని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ నందు ట్రాన్స్‌కో, వైద్య ఆరోగ్య శాఖ, ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందు బాటులో ఉంటారని తెలిపారు.

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ...× కమలాపురం నియోజకవర్గ పరిధిలో ఇస్తేమా కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషమని, ఈ కార్యక్రమ నిర్వహణలో ఎక్కడ కూడా ఎలాంటి ఆవంచానీయ సంగటనలు జరగ కుండా ఎవరికి అంతరాయం జరగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు.కలెక్టర్ గారు సంబంధిత అధికారులతో కమిటి ఏర్పాటు చేశారని,నేను కూడా అందుబాటులో ఉంటాము అని, గౌ.ముఖ్యమంత్రి గారి తరపున నుండి మాకు ఆదేశాలు అందాయన్నారు. ఈ కార్యక్రమాన్ని మా కమలాపురం నియోజక వర్గంలో ఏర్పాటు చేసిన కమిటి వాళ్ళ అందరికి కూడా ధన్యవాదాలు తెలిపారు

ఈ సమీక్ష లో డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడు,కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపి ఐఐసి జెడ్‌ఎం శ్రీనివాస మూర్తి,డిపివో రాజ్యలక్ష్మి, ఏపీఎస్పీడిసిఎల్ ఎన్ఈ రమణ,ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఆర్ అండ్ బి ఎస్ఈ చంద్ర శేఖర్,నాయకులు బిటెక్ రవి,అమీర్ బాబు, తదితర అధికారులు, కమిటీ కార్యవర్గ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, ఆటోమేషన్ పై శిక్షణ

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 20:

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి 23 వరకు 'ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, ఆటోమేషన్' పై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో అధ్యాపకులు, విద్యార్థులు వాస్తవ-ప్రపంచ సెన్సార్ ఇంటర్ ఫేసింగ్ ను ఆచరణాత్మకంగా నేర్చుకుంటున్నారు. స్మార్ట్ ఎనర్జీ మానిటరింగ్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ గేట్ వే సొల్యూషన్స్ వంటి అప్లికేషన్లను అభివృద్ధి చేయడంలో ఈ నైపుణ్యాలను ఉపయోగిస్తారు. అంతేగాక, జాతీయ విద్యా విధానం 2023కు అనుగుణంగా పాఠ్యాంశాలను మెరుగుపరచడం, ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ఆవిష్కరణలపై నైపుణ్యం-ఆధారిత విద్యకు ఈ శిక్షణ ఉపకరించనుంది.బెంగళూరులోని పైటెక్ టెక్నికల్ మేనేజర్ గోపాల్, ఎంబెడెడ్ సాఫ్ట్ వేర్ డెవలపర్ హరీష్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, ఈఈసీఈ అధ్యాపకులు, విద్యార్థులు ఇందులో చురుకుగా పాల్గొంటున్నారు.పైటెక్ డైరెక్టర్ అరుణ్ కుమార్ సింగ్, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి పర్యవేక్షణలో, డాక్టర్ పి.వి. రామకృష్ణ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



## నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాలకు చేరండి: డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి

మణుగూరు, జనవరి 20 (భారతశక్తి): రోడ్డు నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యాలకు చేరాలని మణుగూరు డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పూల మార్కెట్ ఏరియాలో అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడవరాదని సూచించారు. ప్రతి రోజు కూడలి ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడి పోలీస్ కేసులతో ఇబ్బందులు పడవద్దని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా తలకు హెల్మెట్, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఇది ద్విచక్రవాహనాలు నడిపేవారికి రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. వాహనదారులు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, మైనర్లు వాహనం నడపకూడదని హెచ్చరించారు. రోడ్డుమీద ఆటోలు అడ్డంగా పెట్టీ ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. రోడ్డు భద్రతానియమాలపై అవగాహన కల్పించుకోవడమే కాకుండా ఆనియమాలను పాటించాలని చెప్పారు. కుటుంబ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని సూచించారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులతో ప్రయాణించే ఆటో డ్రైవర్లు రోడ్డుపై అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. అతివేగం, అజాగ్రత్త ప్రాణాల మీదకు తెస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. చిన్నపాటి తప్పిదం వలన కుటుంబాల్లో విషాదం నింపుతుందని వివరించారు. అతివేగం, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్లు వాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగబాబు, ఎస్సై నగేష్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన దారులు పాల్గొన్నారు.




## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత -స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ తరపున ఈ-ఆటోలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైఎస్ఆర్ కడప, జనవరి 20(భారత శక్తి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాకు కేటాయించిన ఎనిమిది చెత్త సేకరణ ట్రక్ ఈ-ఆటోలను కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య వ్యర్థాల సేకరణకు గ్రామ పంచాయతీలకు పర్యావరణానికి తోడ్పడే విధంగా ఈ-ఆటోలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క ఆటోను జిల్లాలోని ఎనిమిది మండలాలలోని అట్లూరు, తువ్వ పల్లి, ఉప్పలూరు, కల్లూరు, తొండూరు, పెద్దచెప్పలి, కనువోలుపల్లి, రేకలకుంట పంచాయతీలకు అందివ్వనున్నట్లు తెలిపారు.ఈ -ఆటోలు తడి పొడి చెత్తలను వేరువేరుగా గృహాల నుండి సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తరలించడానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు తడి చెత్త నుండి వర్మీ కంపోస్టు పొడి చెత్త నుండి రీసైక్లింగ్ చేయుట ద్వారా సంపద సృష్టించడం, సర్కులర్ ఎకానమీకి తోడ్పాటును అందించాలనే ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం లక్ష్యంతో ముందుకెళ్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీపీఓ రాజ్యలక్ష్మి, కార్పొరేషన్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి: ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి)జనవరి 20: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రజలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమమే అరైవ్-అలైవ్-2026 అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి




ప్రజలకు అవగాహన కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాల్వంచలోని కె ఎల్ ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా కొన్ని వీడియోలు, ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు భద్రతా నియమాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా, లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు, ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తమ తల్లీదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకుంటూ మంచిగా చదువుకుని క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని అకాక్షించారు. అనంతరం సైబర్ నేరాలపై ఎస్పీ అవగాహన కల్పించారు. అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని తెలిపారు. చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు మారిన పడుతున్నారని తెలిపారు. ఓటీపి, హనీ ట్రాప్, ఆన్లైన్ ట్రేడింగ్, సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడితే జైలుకే

ప్రభుత్వ నిషేధిత గంజాయిని ఎవరైనా సరఫరా చేస్తున్నట్లుగానీ, సేవిస్తున్నట్లు గానీ తెలిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. చాలామంది యువత గంజాయి మత్తుకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తూ పోలీసులు పట్టుబడితే కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, జిల్లా రవాణాధికారి భూషితా రెడ్డి, మోటారు వాహనాల అధికారి వెంకట రమణ, కళాశాల చైర్మన్ నాగమణి, డైరెక్టర్ సిద్దార్థ్ రెడ్డి, పాల్వంచ సీఐ సతీష్, ఎస్సై సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు మండమెలిగే పండుగ

ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 20 (భారతశక్తి) : సమ్మక్క-సారలమ్మ వనదేవతలజాతరలో నేడు మండవెలిగే పండుగ నిర్వహించనున్నామని మేడారం ఆలయ అధికారులు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంగ్రామంలోనిమేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు వారం ముందు జరిగే కార్యక్రమాలను మండమెలగడం, సమ్మక్క సారలమ్మ మందిరాలను శుద్ధికరించడం గుడి మెలగడం పండుగ నేడు (బుధవారం) అంకురార్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. మేడారం,కన్నెపల్లి, పూనుగొండ్ల, కొండాయిలో మండమెలిగే పండుగ నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు వారి ఆడబిడ్డలను




పిలుచుకొని వనదేవతల పూజా మందిరాలను అలుకు పూతలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారని వారు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి: జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, (భారతశక్తి), జనవరి 20: త్వరలో జరగబోయే మున్సిపల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ అన్నారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గాను ఆర్‌ఓలు , ఏఆర్‌ఓలు కు మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె. శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల విధులు, బాధ్యతలను విస్తృతంగా వివరించారు. నోటీసుల జారీ నుంచి ప్రారంభించి నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన , పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం, ఎన్నికల గుర్తుల కేటాయింపు విధానం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోలింగ్ స్టేషన్ల పరిశీలన, పోలింగ్ మెటీరియల్ పంపిణీ, ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. ఎన్నికల నిర్వహణలో పూర్తి అవగాహన కలిగి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అధికారులు సూచించారు. మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఉపయోగించే ఫారాలపై, ముఖ్యంగా నామినేషన్ ఫారాల భర్తీ విధానం, జాగ్రత్తలు తదితర అంశాలను ట్రైనింగ్ అడిషనల్ నోడల్ అధికారి పి. సాయి కృష్ణ వివరించారు. అలాగే, గత ఎన్నికల సమయంలో ఎదురైన అనుభవాలు, సమస్యలు, వాటి పరిష్కారాలపై ఎంపీడీవో శ్రీనివాస్ వివరించారు. శిక్షణలో ప్రత్యేకంగా, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బాక్సుల ద్వారా నిర్వహించే పురపాలక ఎన్నికల సమయంలో ప్రిసైడింగ్ అధికారులు తమ విధుల్లో అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని, వార్డుల వారీ పోలింగ్ కేంద్రాలను సమగ్రంగా పర్యవేక్షించి ఎన్నికల ప్రతి దశను నియమాలకు అనుగుణంగా నిర్వహించవలసిన విధానాన్ని అధికారులు హైలైట్ చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, పాటు సుమారు 200 మంది ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.


# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి: రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 20 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని రకాలుగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల సంఘం కమిషనరు, మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలలో తగు ఏర్పాట్లను చేయాలన్నారు. ఆర్వో, నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ల శిక్షణ గురించి చర్చించారు. ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి తదితర బృందాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

ఈ విసి అనంతరం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీల వారిగా పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమగు మౌళిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరం అవుతారో అంచనా వేసుకొని, తదనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ల అవసరాలను బట్టి వాటిని ముద్రించేందుకు ఏజెన్సీలు గుర్తించాలని తెలిపారు.






ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఈవో భోజన్న, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంతి ఎరుగని ప్రజాసేవ.. 48 గంటల్లో 1000 కిలోమీటర్ల 'మారథాన్' పర్యటన చేసిన మంత్రి జూపల్లి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 20 (భారత శక్తి) రాజకీయాల్లో కొందరికి ప్రత్యేక శైలి ఉంటుంది. మరికొందరికి వేగమే గుర్తింపవుతుంది. కానీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ తనకంటూ ప్రత్యేకమైన 'మంత్రి మార్కు'ను చాటుతున్నారు. కేవలం 48 గంటల్లో సుమారు 1000 కిలోమీటర్ల సుదీర్ఘ పర్యటన నిర్వహించి, ఉత్తర తెలంగాణలో రాజకీయంగా, పరిపాలనపరంగా కొత్త రికార్డు నెలకొల్పారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రారంభమైన మంత్రి జూపల్లి ప్రయాణం మేడారం సమ్మక్క?సారలమ్మ గడప వరకు సాగింది. అక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశంలో చురుగ్గా పాల్గొన్న అనంతరం, సోమవారం వేకువజామునే వనదేవతల ఆశీస్సులు పొంది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పయనమయ్యారు. మంచిర్యాల జిల్లా చెన్నూరులో మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి జూపల్లి, సర్పంచుల పరిచయ కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. అక్కడి నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్, వాంకిడి, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో వరుసగా పర్యటిస్తూ అభివృద్ధి పనులు, శంకుస్థాపనలతో జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 11 గంటల సమయంలో నిర్మల్ ఉత్సవాల వేదికపై హాజరైన మంత్రి, అర్ధరాత్రి వరకు ప్రజలతో మమేకమయ్యారు. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ రాష్ట్ర కార్యాలయంలో బస చేసి ప్రత్యేక



రికార్డు సృష్టించారు. ఇప్పటికే రెండుసార్లు ఐడీఓసీలో బస చేసిన తొలి మంత్రిగా జూపల్లి నిలిచారు. కేవలం ఒకే రోజులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాలను సందర్శించి, అధికారిక కార్యక్రమాలతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయడం ఆయన కార్యదక్షతకు నిదర్శనంగా నిలిచింది. విశ్రాంతిని పక్కనపెట్టి ప్రజల కోసమే పరుగు తీయడం తన నైజమని ఈ 'మారథాన్ పర్యటన' ద్వారా మరోసారి నిరూపించారు. మంగళవారం ఉదయం రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి శర్మిళ తదితర అధికారులతో కలిసి పాల్గొని పతంగులు ఎగురవేశారు. అనంతరం ఉదయం 9 గంటలకే తిరుగు ప్రయాణం ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలలోపే హైదరాబాద్ చేరుకున్నారు. ఆసిఫాబాద్ వరకు మాత్రమే పర్యటన ముగించాల్సి ఉన్నప్పటికీ, నాగోబా దర్శనం, నిర్మల్ ఉత్సవాల్లో పాల్గొనడం, అర్థరాత్రి ఐడీఓసీలో బస చేయడం ఈ పర్యటనకు కొసమెరుపుగా నిలిచాయి. ఈ 48 గంటల పర్యటన మంత్రి జూపల్లి కృష్ణారావు యొక్క అంకితభావానికి, ప్రజాసేవ పట్ల ఉన్న అపార నిబద్ధతకు సజీవ నిదర్శనంగా నిలుస్తోంది.

# దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు రెండో రోజు విశేష స్పందన

## - వినూత్న ఆవిష్కరణలతో విద్యార్థులను ఆకట్టుకున్న ప్రాజెక్టులు



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 20 :

కొల్లూరు క్యాంపస్‌లోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జనవరి 19 నుండి 23 వరకు నిర్వహిస్తున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్?2026 రెండో రోజు కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి. రెండో రోజు నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, సింపోజియం/చర్చా వేదికలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సైన్స్ ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లు వినూత్న ఆలోచనలతో, శాస్త్రీయ దృష్టి కోణంతోరూపొందించబడ్డాయని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన నికితా నాయక్ తెలిపారు. విద్యార్థుల సృజనాత్మకతకు, ఆవిష్కరణల ప్రతిభకు ఈ ఫెయిర్ అద్భుత వేదికగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు. రెండో రోజున తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 18 వేలకు పైగా విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై సైన్స్ ఫెయిర్ స్టాళ్లను సందర్శించారు. ప్రదర్శించిన ప్రయోగాలు, నమూనాలు, ఆవిష్కరణల ద్వారా విద్యార్థులు శాస్త్ర సాంకేతికతపై అవగాహన పెంచుకున్నారు. కోడి వ్యర్థాలను (చికెన్ వ్యస్ట్) ఉపయోగించి చేపలకు ఆహారంగా మార్చే వ్యవసాయ విధానాన్ని, ఆపై చేపల వ్యర్థాలను నైట్రిఫికేషన్ ప్రక్రియ ద్వారా మొక్కలకు ఆహారంగా మార్చే విధానాన్ని సీఎమ్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన దీక్షిత వివరించారు. ఈ ప్రాజెక్ట్ సస్టైనబుల్ అగ్రికల్చర్‌కు చక్కటి ఉదాహరణగా నిలిచింది. అలాగే అగ్రి రోబోట్, ఇంటిగ్రేటెడ్ సస్టైనబుల్ అగ్రికల్చర్, లూనార్ ఫార్మింగ్, ఎక్స్‌ప్లోరర్ రోవర్ వంటి ప్రాజెక్టులు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జెడ్పీహెచ్ఎస్ (గర్ల్స్), పటాన్‌చెరు కు చెందిన హెచ్. అర్చనా మాట్లాడుతూ, ఇంతటి అద్భుతమైన,విద్యాపరమైన ప్రయోగాలను చూడడం ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని, తన స్వంత ప్రయోగాన్ని ప్రదర్శించేందుకు అవసరమైన జ్ఞానం ఈ సైన్స్ ఫెయిర్ ద్వారా పొందానని తెలిపారు. రోజంతా సైన్స్ ఫెయిర్ ప్రాంగణంలో సందర్శకుల రద్దీ కొనసాగింది. తమిళనాడు నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, సైన్స్ ఫెయిర్లు పిల్లల్లో జిజ్ఞాసను రేకెత్తించి, తరగతి గది అభ్యాసాన్ని వాస్తవ ప్రపంచంతో అనుసంధానం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతికత పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ, భవిష్యత్తు శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలను తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి : మంత్రి సీతక్క

## గ్రామాలకు సేవ చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గ్రామాలను ఎంపిక చేయాలి : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 20: నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి సర్పంచ్ పని చేయాలని పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంగళవారం జిల్లా కేంద్రం లోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు ప్రజాస్వామ్యానికి పునాది లాంటివని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని తెలిపారు. త్రాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రజలతో నిరంతరం సమన్వయంతో పారదర్శకంగా పాలన సాగించాలని ఆమె పిలుపునిచ్చారు గ్రామాభివృద్ధి దిశగా సమర్థవంతంగా× సేవలందించి, జిల్లాలోని గ్రామాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.



గ్రామాభివృద్ధి సంబంధిత కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పరిశుభ్రత, త్రాగునీరు, పచ్చదనం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టే పనులన్నీ నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భక్తులకు భద్రతకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్ట బందోబస్తు చర్యలు: జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 20 (భారతశక్తి): జనవరి 23న బాసరలో జరగనున్న వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని, ఈరోజు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్, ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా బారికేడింగ్, ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు విధులు పకడ్బందీగా అమలు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, రూట్ మ్యాపింగ్ చేసి వాహనాలను దారి మళ్లించే విధంగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓతో మాట్లాడిన జిల్లా ఎస్పీ, క్యూ లైన్ల నిర్వహణ, లడ్డు కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణ,వంటి అంశాలపై చర్చించారు. వసంత పంచమి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, శాంతి భద్రతల పరిరక్షణకు తగిన బలగాలతో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, భక్తులకు సురక్షిత వాతావరణంలో దర్శనం కల్పించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలియ జేయడం జరిగింది.

# మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్

## - బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్న రాజేందర్ రెడ్డి
## - పార్టీ కండువా కప్పిన మాజీ మంత్రులు హరీష్ రావు , కేటీఆర్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 20:

మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సంగారెడ్డి రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బగా, ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, పోతిరెడ్డిపల్లి ఉప సర్పంచ్, సిట్టింగ్ మాజీ కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలోమాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో పొన్న రాజేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా హరీష్ రావు కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు పొన్న రామ్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాణిక్ రెడ్డి, దస్తగిరి, ఇంతియాజ్, మధు, నర్సింలు , జవాన్ గిరి, వారితో పాటు వంద మంది యువకులు ఉన్నారు. అధికార పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరికలు జరగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో పాత నేతలకు తగిన గుర్తింపు లేకపోవడం, గౌరవం లేకపోవడం, స్థానిక నాయకులు స్వార్థ రాజకీయాల కోసం పార్టీని వాడుకుంటున్నారనే అసంతృప్తి కారణంగానే తాము పార్టీ మారుతున్నామని పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ చేరికలతో సంగారెడ్డి రాజకీయాల్లో బిఆర్ఎస్ మరింత బలపడగా,సంగారెడ్డి గడ్డపై ఎగరేది గులాబీ జెండానే అన్న నినాదం మరోసారి ప్రతిధ్వనించింది. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, టీఎన్జీవోఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, హక్కీమ్, ఆర్ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, చింత సాయినాథ్, మధుసూదన్ రెడ్డి, విఠల్, మనోహర్ గౌడ్, హరి వర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సంగారెడ్డి మున్సిపాలిటీకి మౌలిక వసతులబలోపేతం

## - రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
## రూ. 31.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 20 :



రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా రూ. 31.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎండీ నిధులతో రూ. 8 కోట్ల వ్యయంతో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు, సీడీఎంఏ నిధులతో రాజీవ్ పార్క్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ పథకం కింద రూ. 18.70 కోట్లతో రోడ్లు, మురుగు కాలువలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు చేపట్టనున్నారు. హెచ్ఎండీఏ నిధులతో రూ. 2 కోట్ల వ్యయంతో రాజంపేటచౌరస్తా నుండి ఫిల్టర్ బెడ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ఫిల్టర్ బెడ్ మరమ్మత్తుల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా మౌలిక సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నదని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, చెత్త నిర్వహణ వంటి సౌకర్యాలు బలోపేతం అయితే పట్టణాలు మరింత శుభ్రంగా, సురక్షితంగా మారుతాయని అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీని అభివృద్ధి పరంగా ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని సహకారాలు అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జయప్రకాశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అడిషనల్ కలెక్టర్ పాండు, రెవిన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గుమ్మడిదల మహిళకు ఆహ్వానం



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 20:

దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను కళ్లారా చూడాలని మనలో చాలామందికి ఉంటుంది. అక్కడికి వెళ్లాలన్నా అక్కడ జరిగే వేడుకలు ప్రత్యక్షంగా చూడాలన్న అందరికీ సాధ్యం కాదు. కానీ గుమ్మడిదలకు చెందిన ఓ మహిళ పారిశ్రామికవేత్తకు అరుదైన గౌరవం దక్కింది. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని కాయిర్ బోర్డు, మహిళా కాయిర్ యోజన కింద ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తలను వారి జీవిత భాగస్వాములతో న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగే 2026 గణతంత్ర దినోత్సవ వేడుకను వీక్షించడానికి తమకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించడం జరిగిందని మహిళా పారిశ్రామికవేత్త చెన్నంశెట్టి మౌనిక ఉదయ్ కుమార్ తెలిపారు, తెలంగాణ ప్రాంతం నుంచి ఐదుగురు మహిళా పారిశ్రామికవేత్తలు ఎంపిక కాగా అందులో తాము ఒక్కరమని ఇలాంటి అవకాశం రావడం చాలా సంతోషమని తెలియజేశారు.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.2.54 కోట్ల చెక్కులు పంపిణీ

## - మంత్రి దామోదర రాజనర్సింహ
## - టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి,జనవరి 20:



సంగారెడ్డిలోని పి.ఎస్.ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి లు సంగారెడ్డి శాసనసభ నియోజకవర్గ పరిధిలోని కంది, కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ. 2.54 కోట్ల విలువైన చెక్కులను 254 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు సామాజిక, ఆర్థిక, విద్యా, వైద్య భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ఆ దిశగా పేదల ఆరోగ్య భద్రత, వైద్య రక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందన్నారు. మహిళల ఉన్నతికి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, పిల్లలకు నైపుణ్యాలు, ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంలో భాగంగా వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా బాల భరోసా కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. వయోవృద్ధుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకుని ప్రణాము కార్యక్రమం ద్వారా వృద్ధుల డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసిందని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదేనని, ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్య చికిత్సలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకప్పుడు క్యాన్సర్ చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోనే క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో కంటి సంబంధిత కాట్రాక్ట్ శస్త్రచికిత్సలు సహా అన్ని ఆధునిక వైద్య సేవలను సంగారెడ్డి ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. టిజిజిఐసి చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, అడగకుండానే ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని అందించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాల అండగా నిలుస్తోందన్నారు. ఇంటి స్థలం ఉన్నా లేకపోయినా ఎమ్మార్వోకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధికి పాటుపడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, కంది సర్పంచ్ శ్రీరామ్,ఆర్డిఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతర అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి : జిల్లా కలెక్టర్






తాడ్వాయి/ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 20 (భారత శక్తి) : మేడారం లోని సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం లోని హరిత హోటల్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటిడిఏ పి. ఓ చిత్ర మిశ్రా తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వనదేవతల మహా జాతర ఇంకా వారం రోజుల గడువు మాత్రమే ఉందని, జాతర పనులన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేసి,అవసరమైన మెరుగులు దిద్దాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులు ఎక్కువగా ఇబ్బందులు పడే అంశాలైన తాగునీరు, మరుగుదొడ్లు, వంటివి నిర్వహణ మరింత మెరుగ్గా ఉండేలా చర్యలుతీసుకోవాలని సూచించారు. అలాగే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకోసం జంపన్న వాగులో నిరంతరం షిఫ్టుల వారీగా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాతర పరిసరాలలోని కీలక ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్లను మోహరించాలని తెలిపారు. భక్తుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి టీటీడీ కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన 50 పడకల ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మేడారం జాతరను సమర్థవంతంగా నిర్వహించి నప్పుడే జాతర విజయ వంతం అవుతుందని పేర్కొన్నారు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతకుముందు ఈ నెల 18న మేడారంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని ఎలాంటి అంతరాయాలు లేకుండా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులను అభినందించారు. రాష్ట్ర చరిత్రలో హైదరాబాద్ వెలుపల నిర్వహించిన కేబినెట్ సమావేశాన్ని కూడా సమర్థవంతమైన, విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించినందుకు అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇది జిల్లా యంత్రాంగం సమన్వయం, అంకితభావానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గారికి సాదర స్వాగతం



వై ఎస్ ఆర్ కడప,జనవరి 20(భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గారు జమ్మలమడుగు మండలం లోని ఎస్ ఉప్పలపాడు ఆదర్శ గ్రామాన్ని మంగళవారం సాయంత్రంపర్యటించేందుకు వైఎస్ఆర్ కడప జిల్లా విమానాశ్రయమునకు మంగళవారం మ. 3.50 గం.లకు చేరుకోగా ..జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా లు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కడప విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన జమ్మలమడుగులోని ఎస్.ఉప్పలపాడు ఆదర్శ గ్రామాన్ని సందర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బయలు దేరి వెళ్ళారు..

# సినిమా

## ‘జన నాయగన్’ విడుదల మరింత ఆలస్యం..
### తీర్పు రిజర్వ్ చేసిన మద్రాసు హైకోర్టు



విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన ‘జన నాయగన్’ విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మూవీ విడుదల, సెన్సార్ సర్టిఫికెట్ విషయంలో మంగళవారం మద్రాసు హైకోర్టులో వాదనలు జరిగాయి. దాదాపు మూడు గంటలకు పైగా సుదీర్ఘ వాదనలు జరగ్గా, చీఫ్ జస్టిస్ మహీంద్ర మోహన్ శ్రీవాత్సవ, జస్టిస్ జి అరుళ్ మురుగన్ నేతృత్వంలో డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. గతంలో ‘జన నాయగన్’కు ఊరటనిస్తూ యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వాటిని సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్) డివిజన్ బెంచ్‌కు వెళ్లింది. మంగళవారం సీబీఎఫ్‌సీ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఏఆర్ఎల్ సుందరేశన్ తన వాదనలు వినిపించారు. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి బోర్డుకు సమయం ఇవ్వలేదని, అలాగే, సినిమాను మరోసారి సమీక్షించేందుకు రివిజన్ కమిటీకి పంపాలని ఇచ్చిన సమాచారాన్ని నిర్మాతలు సవాల్ చేయలేదన్నారు. దీనిపై సీనియర్ న్యాయవాది సతీశ్ పరాశరన్ వాదనలు వినిపిస్తూ, యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న తర్వాత బోర్డులోని ఒక సభ్యుడి అభిప్రాయం మేరకు సీబీఎఫ్‌సీ తన నిర్ణయాన్ని మార్చుకుందన్నారు. మెజార్టీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి పోయి, మైనార్టీ నిర్ణయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. సీబీఎఫ్‌సీ అభ్యంతరాల మేరకు నిర్మాతలు సినిమాలోని సన్నివేశాలను తొలగించారన్నారు. అయితే, డిలీట్ చేసిన సన్నివేశాలను మళ్లీ జోడించి, ఆ తర్వాత వాటినే మళ్లీ తొలగించాలని వాళ్లు కోరుకుంటున్నారని, ఇది వివాదం కాదని, సర్టిఫికెట్ ఇవ్వకుండా సినిమాను అటూ ఇటూ తిప్పే కార్యక్రమమని పరాశరన్ కోర్టుకు తెలిపారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన సుదీర్ఘ వాదనల అనంతరం మద్రాసు హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

## వెంకీ మూవీలో నారా రోహిత్




విక్టరీ వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. దీనికి ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. ఇందులో వెంకీ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే రిలీజైన టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో మరో హీరో నారా రోహిత్‌భాగం కాబోతున్నారని టాక్. సినిమాలో ఆయన నెగెటివ్ షేడ్స్ ఉన్న పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని.. ఇది కథలో చాలా కీలకమైన క్యారెక్టర్ అని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పాత్ర నచ్చడంతో నారావారబ్బాయి వెంటనే ఓకే చేశాడని, త్వరలోనే షూటింగ్ లో జాయిన్ కా బోతున్నారని నివేదికలు పేర్కొన్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వచ్చే వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## పెండ్లిపై క్లారిటీ



నేషనల్ క్రష్ రష్మిక మందాన్న, రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కొద్ది నెలల క్రితమే ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారనే వార్తలు చక్కర్లు కొట్టాయి. అప్పటి నుంచే వీరి పెండ్లి ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరగనుందనే ప్రచారం బలంగా సాగుతోంది. అయితే ఈ విషయంపై ఇద్దరూ ఇప్పటివరకు మౌనంగానే ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ముద్దుగుమ్మ.. తనపై వస్తున్న రూమర్స్‌పై స్పందించింది. ‘నాలుగేండ్లుగా ఇలాంటివి వింటూనే ఉన్న. అప్పటి నుంచి అందరూ అదే ప్రశ్న అడుగుతున్నరు. దాని కోసమే నేను కూడా ఎదురుచూస్తున్న. దీనిపై ఎప్పుడు చెప్పాలో అప్పుడే మాట్లాడతా. ఆ సమయం వచ్చినప్పుడు కచ్చితంగా చెప్త. అప్పుడే నిజం తెలుస్తుంది’ అంటూ చాలా తెలివిగా సమాధానం ఇచ్చింది. ఇక గతేడాది ‘ది గర్ల్‌ఫ్రెండ్’తో హిట్ కొట్టిన రష్.. కొత్త ఏడాదిలోనూ అభిమానులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం తెలుగులో ‘మైసా’, హిందీలో కాక్‌టెయిల్-2 చిత్రాల్లో నటించడంతో పాటు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా మారిపోయింది.

## తప్పిన ముప్పు



బాలీవుడ్ యాక్షన్ హీరో అక్షయ్ కుమార్, ట్వింకిల్ ఖన్నా దంపతులు ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం జరిగింది. ఈ జంట విదేశీ పర్యటన ముగించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు నుంచి ముంబై జూహులోని ముక్తేశ్వర్ రోడ్ సమీపానికి రాగానే వేగంగా వచ్చిన ఒక మెర్సిడెస్ కారు ముందు వెళ్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఆ వేగానికి ఆటో అదుపుతప్పి అక్షయ్ కుమార్ భద్రతా సిబ్బంది ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఆ ఇన్నోవా వాహనం అక్షయ్ కుమార్ దంపతులు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీను ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ అక్షయ్ దంపతులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కి తీవ్ర గాయాలు కావడంతో దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అక్షయ్ కుమార్, ట్వింకిల్ ఖన్నా తమ 25వ వివాహ వార్షికోత్సవం జరుపుకునేందుకు విదేశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.





## మాళవిక మోహనన్
### అందమైన చీర వైబ్స్

ఈ సొగసైన ఫోటోలో మాళవిక ఉత్సాహంగా, అందంగా కనిపిస్తుంది: లేత ఆకుపచ్చ రంగు చీరలో చిక్కటి బంగారు అంచులు మరియు గులాబీ పూల ఎంబ్రాయిడరీతో, దానికి సరిపోయే గులాబీ రంగు బ్లౌజ్‌పై కప్పబడి ఉంటుంది. ఆమె పొడవాటి, తేలియాడే జుట్టు, సూక్ష్మమైన మేకప్, బిందీ మరియు అలంకరించబడిన బంగారు ఆభరణాలు - షాన్డిలియర్ చెవిపోగులు మరియు పేర్చబడిన గాజులు - ఆమె ప్రశాంతమైన వ్యక్తీకరణ మరియు ఆలోచనాత్మక దృష్టిని మెరుగుపరుస్తాయి. ఆమె శీర్షిక ప్రకారం: “ఇది ఒక అందమైన రూపం మరియు ఒక అందమైన రోజు” - ఈ చిత్రం కాలాతీత అందం, స్త్రీత్వం మరియు నిర్మలమైన ఆకర్షణను ప్రసరింపజేస్తుంది, ఆమె జాతి చక్కదనాన్ని సంపూర్ణంగా సంగ్రహిస్తుంది.

## నన్ను కాపాడటానికి అమ్మానాన్న, భర్త ఎవరూ లేరు: రేణూ దేశాయ్ పోస్ట్

తనను కాపాడటానికి ఎవరూ లేరని నటి రేణూ దేశాయ్ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది. వీధి కుక్కలను చంపేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తనను కొందరు విమర్శిస్తున్నారని.. ఎన్ని విమర్శలు వచ్చినా తాను మాత్రం పోరాటం ఆపనని మరోసారి స్పష్టం చేశారు. కాశీలో గంగానదిలో బోటింగ్ చేస్తున్న వీడియోను రేణు పంచుకున్నారు. ‘‘నన్ను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరు. తాజా అంశంపై నా తప్పు లేకున్నా ఎంతోమంది నన్ను విమర్శిస్తున్నారు. మీరు చేసే వ్యాఖ్యలపై తిరిగి స్పందించను. నేను నమ్మే భగవంతుడి దగ్గర మాత్రమే నా బాధను చెబుతాను. ఆయన నా ప్రార్థనలు వింటాడన్న నమ్మకం నాకు ఉంది. నేను తరచూ కాశీకి ఎందుకు వెళ్తానో మీకు ఇప్పుడు అర్థమై ఉంటుంది..’’ అని అన్నారు. ఇక వీధి కుక్కలను చంపడంపై తన పోరాటం గురించి కూడా రేణు ఈ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ‘‘నేనెప్పుడూ నా వ్యక్తిగత హక్కుల కోసం పోరాడలేదు. కానీ, వీధి కుక్కల విషయంలో ఈ పోరాటం ఆపను. కొన్ని కుక్కలు చేసిన తప్పు వల్ల వందల సంఖ్యలో వాటిని చంపాలనే నిర్ణయం సరైనది కాదు. ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకునే వరకూ పోరాడుతూనే ఉంటాను’’ అని స్పష్టం చేశారు. ఇక ఈ అంశంపై రేణు ప్రెస్‌మీట్ అనంతరం ఆమె పొలిటికల్ పార్టీలో చేరనున్నారని వచ్చిన వార్తలపై కూడా స్పష్టతనిచ్చారు. తనకు అలాంటి ఉద్దేశం లేదన్నారు.





# సురక్షితంగా గమ్యం చేరాలంటే రోడ్డు భద్రతే ప్రధాన లక్ష్యం

*** నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ.**




ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తూ,మానసిక ఆందోళనలకు దూరంగా ఏకాగ్రతతో వాహనాలు నడిపినప్పుడే ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాన్ని చేరగలుగుతారని నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ అన్నారు.ఈ నెల 1వ తేదీ నుంచి జనవరి 31 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బండ్లగూడ టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ, నాగోల్ రవాణా శాఖ అధికారి అభిలాష్, వైద్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ, గతంలో ప్రజలు వివిధ వ్యాధుల వల్ల మృతి చెందేవారని, అయితే ప్రస్తుతం అత్యధికంగా రోడ్డు ప్రమాదాలే ప్రాణాలు తీసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్దలు, యువత, విద్యార్థులు మరణించడంతో ఎన్నో కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోతున్నాయని అన్నారు. ప్రధానంగా వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. క్షణిక నిర్లక్ష్యం జీవితకాల విషాదంగా మారుతుందని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రమాదాలకు డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడటమే కారణమని వివరించారు. తమ కుటుంబాల్లోనూ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా పిల్లలు, బంధువులు, స్నేహితులకు రోడ్డు భద్రత నియమాలు తెలియజేసి అవగాహన కల్పించాలని సీఐ ప్రజలకు పిలుపునిచ్చారు.బండ్లగూడ టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ, తమ సంస్థలో డ్రైవర్లు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోను కాకుండా తరచూ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.




జాతీయ రోడ్డు భద్రతా దినోత్సవాల సందర్బంగా ఎల్బీనగర్ పోలీసుల ఆధ్వర్యంలో అర్రైవ్ అలైవ్ ప్రోగ్రాంలో భాగంగా కామినేని ఫ్లైఓవర్ సమీపంలోని భరత్ నగర్ లో స్థానిక వాసులకు, బాటసారులకు మద్యం తాగి వాహనాలు నడపడం వలన జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య,సీఐ వినోద్ కుమార్, ఎస్ఐలు, ట్రాఫిక్ ఎస్ఐ, ఏఎస్ఐ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్బీనగర్, జనవరి 20(భారత శక్తి):

# కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే యువకుడి మృతి..!

- **ఏ నిబంధన ప్రకారం రహదారులు నిర్మాణం చేశారు.**
- **ర్యాంపులో జరిగే అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టాలి.**
- **రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్**



మణుగూరు, జనవరి 20 (భారతశక్తి): మండల పరిధిలోని తిర్లాపురం ఇసుక ర్యాంపులో బడా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా యువకుడు మృతి చెందాడని రేణుక అక్షర మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆరోపించారు. మంగళవారం అంబేద్కర్ సెంటర్ లో గల రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సొసైటీ ర్యాంపుల్లో బడా కాంట్రాక్టర్ల హవా జోరుగా సాగుతోందని ఆమె ఆరోపించారు. గోదావరి నుండి మైదాన ప్రాంతానికి ఇసుకను తరలించేందుకు నిర్మించిన రహదారులు ఏ నిబంధన ప్రకారం జరిగిందో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. నిత్యం పర్యవేక్షిస్తున్నామని చెప్పే టిజిఎండిసి అధికారులకు గోదావరి తల్లి పడే ఘోష కనబడటం లేదా అని ప్రశ్నించారు. గోదావరిలో ఇసుక నాణ్యత పరిశీలన కోసం తీసిన గుంతలు తిరిగి పూడ్చకపోవడం వల్లే యువకుడి మృతి చెందినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాన్ని కోల్పోవాల్సి వచ్చిందని ఆమె దుయ్యబట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి పొట్ట కూటి కోసం వచ్చిన వారికి కనీసం రక్షణ లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజన సొసైటీల్లోకి చొరబడిన బడా కాంట్రాక్టర్ల కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించాల్సిన ర్యాంపులు శ్రమ దోపిడీ కేంద్రాలుగా మారుతున్నాయని ఆమె ఆరోపించారు. ఏజన్సీ ఏరియాలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా, బడా కాంట్రాక్టర్ ను తరిమికొట్టేందుకు ఆదివాసీ, దళిత, మహిళ సంఘాలు కదిలి రావాలని పిలుపు నిచ్చారు. స్థానిక కలెక్టర్ ఈ ఘటనపై వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని ఆమె కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చి మృతి చెందిన బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలతో సంయుక్తంగా పారదర్శక విచారణ జరపాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, బాడిస పార్వతి, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.




# రంజాన్ మాసంలో ముస్లింల
## ప్రార్థనల కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 20 (భారతశక్తి): నిర్మల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు, ముస్లిం మత పెద్దలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రంజాన్ నెలలో మసీదుల దగ్గర నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మసీదుల దగ్గర ప్రార్థనా సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో అవసరమైన చోట రోడ్లకు మరమ్మత్తులు చేయాలని, పార్కింగ్ సమస్యలు ఏర్పడకుండా చూడాలన్నారు. మసీదులలో ఎప్పుడూ త్రాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రార్థనా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారులు త్వరితగతిన స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటి వివరాలు తెలిపేందుకు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. రంజాన్ పండుగనాడు అన్ని ఈద్గాలలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈద్గాలలో త్రాగునీరు, షామియానాలు, ఇతర ఏర్పాట్లను చేయాలన్నారు. పిచ్చి మొక్కలు, పొదలు తొలగించి, ఈద్గా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అన్ని మతాల పండుగలను సహోదర భావంతో జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ , మైనారిటీ అధికారి మోహన్ సింగ్, ఆర్డీవో రత్నకళ్యాణి, ముస్లిం మత పెద్దలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భైంసా సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి – ముగ్గురికి గాయాలు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 20 (భారత శక్తి): భైంసా టౌన్ సీఐ టి. సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం,20012026 తేది 00.40 గంటల సమయంలో భైంసా పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలోని సాత్‌పూల్ వంతెన వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మల్ నుంచి బోకర్ ఎక్స్ రోడ్ వైపు వెళ్తున్న భారీ కంటెయినర్ (వాహన నంబర్: RJ06GA9446), హైదరాబాద్ నుంచి కుబీర్ వైపు వస్తున్న **ఎర్టిగా కారు (వాహన నంబర్: TS 18 F 7276)**ను ఎదురుగా ఢీకొట్టింది. ఎర్టిగా వాహనంలో మొత్తం 7 మంది ప్రయాణికులు ఉండగా, అందులో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

**మృతుల వివరాలు:**

భోజారం పాటిల్, తండ్రి: పాండురంగ్ పాటిల్, వయస్సు 45 సం., కులం: పాటిల్, వృత్తి: వ్యవసాయం, నివాసం: కుప్తి గ్రామం.

కోడెమెల రాజన్న, తండ్రి: నాగన్న, వయస్సు 60 సం., కులం: మాకాపు, వృత్తి: వ్యవసాయం, నివాసం: కుప్తి గ్రామం.

బోయెడి బాబాన్న, తండ్రి: సాంబన్న, వయస్సు 65 సం., కులం: ముదిరాజ్, వృత్తి: వ్యవసాయం, నివాసం: కుప్తి గ్రామం.

బొప్పా వికాస్, తండ్రి: నాగలింగం, వయస్సు 23 సం., ఎర్టిగా వాహన డ్రైవర్, నివాసం: కుబీర్ గ్రామం.

**గాయపడిన వారి వివరాలు:**

ఆనందరావు పాటిల్, తండ్రి: —, వయస్సు 55 సం., కులం: పాటిల్, వృత్తి: వ్యవసాయం, నివాసం: కుప్తి గ్రామం.

గుండోళ్ల లక్ష్మణ్, తండ్రి: లక్ష్మణ్, వయస్సు 35 సం., కులం: మాకాపు, వృత్తి: వ్యవసాయం, నివాసం: కుప్తి గ్రామం.

పొదుగంటె గంగాధర్, తండ్రి: లక్ష్మణ్, వయస్సు 37 సం., కులం: ఎస్సీ (మాదిగ), వృత్తి: సర్పంచ్, నివాసం: కుప్తి గ్రామం.

(పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.)

ఈ ప్రమాద ఘటనలో మృతి చెందిన బోయెడి బాబాన్న కుమారుడు బోయెడి దత్తు (కుప్తి గ్రామం, కుబీర్ మండలం) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




# రాత్రి సమయాల్లో
## వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించాలి

**: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 20 (భారత శక్తి): సోమవారం అర్ధరాత్రి భైంసా పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో ఉన్న వంతెన పై జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఘటన సమాచారం అందగానే పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.గాయపడిన వారిని వెంటనే నిజామాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ ప్రమాద స్థలాన్ని ఈరోజు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ సందర్శించి, ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... రాత్రి సమయాల్లో వీలైనంత వరకు ప్రజలు ప్రయాణాలు తగ్గించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణాలు చేయాలని సూచించారు. హనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ, రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని కోరారు.ఈ సందర్భనలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీన, భైంసా ఇన్స్పెక్టర్ సాయి కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# అర్రైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా
## హెల్మెట్ నమూనాను ఆవిష్కరించిన మంత్రి సీతక్క



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 20: రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "అర్రైవ్, అలైవ్" కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క (దానసరి అనసూయ) నూతన హెల్మెట్ నమూనాను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కొత్త హెల్మెట్ నమూనా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో పాటు, సౌకర్యవంతంగా, తేలికగా రూపొందించబడిందని తెలిపారు. యువతతో పాటు అన్ని వయస్సుల వారు హెల్మెట్‌ను నిత్యం వినియోగించేలా అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం తగ్గించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే "అర్రైవ్, అలైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో భద్రతా స్పృహను పెంచుతున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రవాణా శాఖ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



సంగారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) జనవరి 20: సంగారెడ్డి జిల్లా తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షరీఫ్, కార్యదర్శి జె. నాగరాజు, సంగారెడ్డి టౌన్ అధ్యక్షుడు వి. పండరి తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ మాట్లాడుతూ, ప్రభుత్వ వ్యవస్థలో నాలుగో తరగతి ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు ప్రజాపాలనలో అత్యంత విలువైనవని ప్రశంసించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.

# దుర్గం చెరువుకు 'మురుగు' ఉచ్చు!

* హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం.. క్షేత్రస్థాయిలో పరిశీలన
* సమన్వయ లోపంపై అధికారులకి చురకలు.. ప్రక్షాళనకు సత్వర చర్యలు..



హైదరాబాద్, జనవరి 20 (భారత శక్తి): ఐటీ హబ్‌కు మణిహారంగా నిలిచే మాదాపూర్‌లోని దుర్గం చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకోవడంపై హైడ్రా (HYDRAA) తీవ్రంగా స్పందించింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరుతుండటం, గుర్రపుడెక్క విస్తరించి దుర్గంధం వెదజల్లడంపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, మీడియా కథనాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. చెరువు దుస్థితిని చూసి ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**మురుగు నీరు నేరుగా చెరువులోకా?**

పర్యటన సందర్భంగా చెరువులో సగానికి పైగా గుర్రపుడెక్క పరుచుకుని ఉండటాన్ని కమిషనర్ గమనించారు. మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు (STP) అందుబాటులో ఉన్నప్పటికీ, వరద కాలువల ద్వారా మురుగు నీటిని నేరుగా చెరువులోకి వదలడంపై అధికారులను నిలదీశారు. ఎస్టీపీల సామర్థ్యం మించి మురుగు వస్తోందని ఇరిగేషన్ ఇంజినీర్లు చెప్పిన సమాధానంపై ఆయన మండిపడ్డారు. "అదనపు మురుగు వస్తే డ్రైనేజీ కాలువలకు మళ్లించాలి తప్ప, నేరుగా చెరువులోకి వదిలి కలుషితం చేయడం ఏంటి?" అని ప్రశ్నించారు. ఒకవైపు శుద్ధి చేసిన నీటిని వదులుతూ, మరోవైపు నేరుగా మురుగును కలపడం వల్ల ప్రయోజనం ఏముంటుందని నిలదీశారు.

**అధికారుల మధ్య 'సమన్వయ' లేమి**

చెరువు అభివృద్ధి అంటే కేవలం పైపై మెరుగులు దిద్దడం కాదని, కాలుష్య నివారణే ప్రధానమని కమిషనర్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో పాటు రహేజా మైండ్‌స్పేస్, రాంకీ సంస్థల మధ్య సమన్వయ లోపం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన అభిప్రాయపడ్డారు. బాధ్యతల నుంచి ఎవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. ఎస్టీపీల నుంచి వస్తున్న నీటి నమూనాలను తక్షణమే సేకరించి పరీక్షల నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి (PCB)కి పంపాలని అధికారులను ఆదేశించారు.

**ప్రక్షాళనకు కార్యాచరణ..**

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం హైడ్రా కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రక్షాళన పనులకు ఉన్న అడ్డంకులను తొలగించేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు:

ట్రాఫిక్ మళ్లింపు: పైపులైన్ డైవర్షన్ పనుల కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ గారితో మాట్లాడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమన్వయం చేశారు.

డైవర్షన్ కాలువ: ఇన్ ఆర్బిట్ మాల్, నెక్టర్ గార్డెన్స్ వంటి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి రాకుండా, పడమర వైపు ప్రత్యేక కాలువ తవ్వేలా చర్యలు తీసుకోవాలని రహేజా సంస్థ ప్రతినిధులకు సూచించారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు: జలమండలి, విద్యుత్, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పని చేసి చెరువులోకి మురుగు నీటి చేరికను తక్షణమే అడ్డుకోవాలని ఆదేశించారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే క్రమంలో దుర్గం చెరువు పునరుజ్జీవానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.




# బాచుపల్లిలో రూ. 300 కోట్ల భూమికి విముక్తి

* పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత
* ఎమ్మార్వో ఆఫీసు భూమిని కూడా స్వాధీనం చేసుకున్న హైడ్రా
* కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో వేగంగా చర్యలు..

బాచుపల్లి, జనవరి 20 (భారత శక్తి) : ఖరీదైన భూములకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన బాచుపల్లిలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి హైడ్రా (HYDRAA) విముక్తి చేసింది. సుమారు 300 కోట్ల రూపాయల విలువ చేసే 2.30 ఎకరాల పార్కు స్థలంతో పాటు, ఎమ్మార్వో కార్యాలయానికి కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

కబ్జా పర్వం సాగిందిలా.. బాచుపల్లి గ్రామం సర్వే నంబరు 142, 143, 144లో ఉన్న 2.30 ఎకరాల భూమిని 2016లో అప్పటి కలెక్టర్ పార్కు కోసం కేటాయించారు. అక్కడ ప్రభుత్వం అర్బన్ నర్సరీని ఏర్పాటు చేసి, వందలాది మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించింది. కాపలాదారుని గది, బోర్ వెల్, వాటర్ సంప్ వంటి సౌకర్యాలను కూడా కల్పించారు. అయితే, గత ఏడాది (2023) కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కన్ను ఈ భూమిపై పడింది. రాత్రికి రాత్రే జెసిబిలతో మొక్కలను ధ్వంసం చేసి, ఆ స్థలం తమదంటూ ప్రహరీ గోడలు నిర్మించారు. రంగంలోకి హైడ్రా.. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, క్షేత్రస్థాయిలో విచారణకు ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలిసి రికార్డులను పరిశీలించిన అనంతరం, అది ప్రభుత్వ పార్కు స్థలమేనని నిర్ధారించారు. దీంతో మంగళవారం ఉదయం భారీ బందోబస్తు మధ్య హైడ్రా బృందం అక్కడకు చేరుకుని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. స్వాధీనం చేసుకున్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, 'ఇది ప్రభుత్వ భూమి' అని తెలిపేలా బోర్డులను ఏర్పాటు చేశారు. ఎమ్మార్వో కార్యాలయ భూమి కూడా.. అదే సర్వే నంబర్లలో తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించిన 30 గుంటల స్థలాన్ని కూడా కబ్జాదారులు ఆక్రమించగా, హైడ్రా అధికారులు ఆ ఆక్రమణలను కూడా తొలగించారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి హైడ్రా చర్యలను స్వాగతించారు. "ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్న హైడ్రాకు ధన్యవాదాలు" అంటూ నినాదాలు చేయడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది.

# హైర్ బస్సు యజమానుల సమస్యలు పరిష్కరిస్తాం

: మంత్రి పొన్నం ప్రభాకర్..
* ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది...
* సచివాలయంలో 'హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్' డైరీ ఆవిష్కరణ




హైదరాబాద్, జనవరి 21 (భారత శక్తి/ వనస్థలిపురం): తెలంగాణ రాష్ట్ర హైర్ బస్సు యజమానుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. మంగళవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర హైర్ బస్సు ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన డైరీని ఆర్టీసీ ఎండీ వి.సి. సజ్జనార్ (వై. నాగిరెడ్డి)తో కలిసి మంత్రి ఆవిష్కరించారు.

**ఆర్టీసీ ప్రగతికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ:**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్టీసీ సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో హైర్ బస్సుల పాత్ర కీలకమని, ఈ క్రమంలో యజమానులకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే సానుకూలంగా స్పందిస్తామన్నారు. ఆర్టీసీ బలోపేతానికి సంస్థ సిబ్బందితో పాటు హైర్ బస్సు యాజమాన్యం కూడా సమన్వయంతో పని చేయాలని కోరారు.

* **సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి:**

ఆర్టీసీ ఎండీ మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, హైర్ బస్సుల నిర్వహణలో నాణ్యత పాటించాలని సూచించారు. యజమానుల అభ్యున్నతికి సంస్థ తరపున పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు తెలంగాణ రాష్ట్ర హైర్ బస్సు ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ. మధుకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. మహిపాల్ రెడ్డి, కోశాధికారి ఎన్. సత్యంబాబు పాల్గొన్నారు. వీరితో పాటు అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, నాగేంద్రబాబు, సుధాకర్ రెడ్డి, కొండల్ రెడ్డి, సతీష్, జగదీశ్వర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రికి తమ విన్నపాలను అందజేశారు.

# బస్తీ సమస్యల పరిష్కారమే లక్ష్యం: మేయర్ గద్వాల విజయలక్ష్మి

* బంజారాహిల్స్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను త్వరలో ప్రారంభిస్తాం..!
* ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశంలో మేయర్..




బంజారాహిల్స్, జనవరి 20 (భారత శక్తి) : బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని బస్తీ ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో బంజారాహిల్స్ డివిజన్ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు మరియు బస్తీ వాసులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై



సుదీర్ఘంగా చర్చించారు. అందుబాటులోకి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని మేయర్ వెల్లడించారు. ఈ ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడం వల్ల స్థానిక బస్తీ ప్రజలు తమ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను తక్కువ ఖర్చుతో నిర్వహించుకునే వీలుంటుందని ఆమె పేర్కొన్నారు. ఇది కేవలం భవనం మాత్రమే కాదని, ప్రాంతీయ అభివృద్ధికి ఒక చిహ్నమని ఆమె కొనియాడారు.

**ప్రజల ముంగిటకే పాలన:**

సమావేశంలో పాల్గొన్న బస్తీ ప్రతినిధుల నుంచి మేయర్ స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై స్పందిస్తూ.. రోడ్లు & డ్రైనేజీ: పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.

మౌలిక సదుపాయాలు: వీధి దీపాలు, పార్కుల నిర్వహణలో ఎక్కడా అలసత్వం వహించకూడదు.

స్వచ్ఛత: డివిజన్ వ్యాప్తంగా పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

**సమన్వయంతో పనిచేయాలి:**

అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ ఆదేశించారు. ఈ సమీక్షలో జీహెచ్ఎంసీ డెప్యూటీ కమిషనర్, ఎస్ఈ (SE), వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ అధికారులు మరియు స్థానిక నేతలు పాల్గొన్నారు.



## పరిశుభ్రతపై మార్నింగ్ వాక్‌లో
# బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పరిశీలన

* స్వచ్ఛ గడ్డిఅన్నారం – మనందరి కర్తవ్యం..!

ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి మంగళవారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో పరిశుభ్రత పనులను, జిహెచ్ఎంసి పరిశుభ్రత కార్మికుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీల పరిశుభ్రత పట్ల జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏలు, పరిశుభ్రత కార్మికులు, స్వచ్ఛ ఆటో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. చెత్త తొలగింపు సరిగా జరగకపోవడం, రోడ్లు, పార్కుల పరిసరాల పరిశుభ్రత లోపించడం, కాలనీవాసుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. పరిశుభ్రత పనుల పట్ల ఈ నిర్లక్ష్యం తక్షణమే తొలగించాలి. మున్సిపల్ సిబ్బంది విధుల్లో క్రమం తప్పకుండా పాల్గొని పరిశుభ్రతా పనులు నాణ్యతతో నిర్వహించాలి. కాలనీల పరిశుభ్రత మనందరి బాధ్యత. సమస్యలపై కాలనీ వాసులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. పరిశుభ్రతలో లోపాలు ఉన్నచోట తక్షణం చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీవాసులు, జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏ సిబ్బంది, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల దర్శనంపై ఏపీ ఆర్టీసీ & టీజీ ఆర్టీసీ బంపర్ అవకాశం

హైదరాబాద్, జనవరి 20 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా బస్సుల్లో, తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీ & టీజీ బస్సుల్లో రోజుకు 1000 దైవ దర్శనం టిక్కెట్లు జారీ చేయబడ్డాయి. ఏపిఎస్ ఆర్‌టీసీ & తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు వెళ్లే ప్రయాణికులకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఈ సువర్ణావకాశం కల్పించారు. తిరుపతికి వెళ్లే ప్రయాణికులు రూ.300 అదనంగా చెల్లించి బస్సులోనే ఏపీ & తెలంగాణ ఆర్టీసీ లగ్జరీ & లహరి బస్లో దర్శనం టికెట్ పొందవచ్చు. ఈ శీఘ్రదర్శనం ప్రతిరోజూ ఉదయం 11.00 మరియు సాయంత్రం 4.00 గంటలకు నిర్వహించబడుతుంది. తిరుమల బస్టాండ్‌కు చేరుకున్నప్పుడు ఏపీఎస్ ఆర్టీసీ సూపర్‌వైజర్లు ప్రయాణికులకు శీఘ్రదర్శనానికి సహకరిస్తారు. కావున తిరుపతికి వెళ్లే ప్రయాణికులు ముందుగా ఆర్టీసీ బస్సుల్లో దర్శనం టిక్కెట్లు




పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీ & టీజీఎస్ ఆర్టీసీ తిరుపతికి రోజూ 650 బస్సులను నడుపుతోంది. ప్రతి డిపో నుండి తిరుపతికి బస్సు సౌకర్యం ఉంది. బెంగళూరు, చెన్నై, కంచి, వెల్లూరు, పాండిచ్చేరి, హైదరాబాద్ మొదలైన నగరాల నుండి దైవ దర్శనం కోసం వచ్చే ప్రయాణికులకు ఇది చాలా సౌకర్యవంతంగా ఉంటుంది.

# ఫ్యూచర్ సిటీ కోసం తెలంగాణ ప్రభుత్వంతో చేతులు కలిపిన యూఏఈ

హైదరాబాద్, జనవరి 20 (భారత శక్తి):భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణతో భాగస్వామ్యం కుదుర్చుకోనున్నట్లు తెలిపింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్ బిన్ తౌక్ అల్ మర్రీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందాన్ని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మర్రీ మాట్లాడుతూ, తెలంగాణతో కలిసి పనిచేయడానికి సంతోషంగా ఉన్నామని అన్నారు. ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకువెళ్లడానికి రెండు ప్రభుత్వాలు అధికారులతో ఒక ఉమ్మడి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతినిధి బృందం భారత్ ఫ్యూచర్ సిటీలో సహకారానికి గల అవకాశాలపై చర్చించింది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను యూఏఈ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపడమే తమ లక్ష్యమని తెలిపారు. దేశంలోనే తొలి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా 30,000 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. విద్య, ఆరోగ్యం, ఏఐ, పరిశ్రమలు, నివాసాలు, వినోద రంగాలకు ప్రత్యేక జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మారుబేని, సెమ్‌కార్ప్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు ఇప్పటికే ఈ ప్రాజెక్టు కోసం చేతులు కలిపాయని అన్నారు. ఫ్యూచర్ సిటీలో జూను స్థాపించడం కోసం రిలయన్స్ గ్రూప్ వంతారాతో అవగాహన ఒప్పందం కుదిరిందని ముఖ్యమంత్రి వివరించారు.

## ఆ కంపెనీని కొనమంటారా, వద్దంటారా... ఎక్స్ యూజర్లను అభిప్రాయం అడిగిన ఎలాన్ మస్క్

జనవరి 20 (భారత శక్తి): టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తన సోషల్ మీడియా పోస్ట్‌తో సంచలనం సృష్టించారు. యూరప్‌కు చెందిన అతిపెద్ద బడ్జెట్ ఎయిర్‌లైన్ 'ర్యాన్‌ఎయిర్'ను కొనుగోలు చేయమంటారా? అంటూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోల్ ప్రారంభించారు. ర్యాన్‌ఎయిర్ సీఈఓ మైఖేల్ ఓ'లియరీతో జరిగిన తీవ్ర వాగ్వాదం తర్వాత ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ర్యాన్‌ఎయిర్ విమానాల్లో స్టార్‌లింక్ సేవలను ఇన్‌ఫ్లైట్ వైఫైగా ఉపయోగించడంపై మొదలైన వ్యాపార విభేదం వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది. తమ వ్యాపారానికి స్టార్‌లింక్ ఖర్చులు సరిపడవని ర్యాన్‌ఎయిర్ ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ర్యాన్‌ఎయిర్ సీఈఓ ఓ'లియరీ.. మస్క్‌ను "ఒక ఇడియట్" అని, అతడిని ఎవరూ పట్టించుకోవద్దని వ్యాఖ్యానించారు. దీనిపై మస్క్ ఘాటుగా స్పందిస్తూ ఓ'లియరీ "అట్టర్ ఇడియట్" అని, "అతడిని ఉద్యోగంలో నుంచి తీసేయండి" అని పోస్ట్ చేశారు. ఈ మాటల యుద్ధం నేపథ్యంలోనే మస్క్.. ర్యాన్‌ఎయిర్‌ను కొనుగోలు చేయాలా వద్దా అని పోల్ నిర్వహించారు. కొద్ది గంటల్లోనే ఈ పోల్‌కు 7,50,000కు పైగా ఓట్లు రాగా, 76.8 శాతం మంది కొనుగోలుకు మద్దతు తెలిపారు. తనదైన శైలిలో స్పందించిన మస్క్, "ర్యాన్‌ఎయిర్‌ను 'ర్యాన్' అనే వ్యక్తి నడపాలి, అతడిని అసలైన పాలకుడిగా చేయడం మీ విధి" అంటూ చమత్కరించారు. అయితే, ఇది కేవలం సరదా పోలా లేక నిజంగానే టేకోవర్ చేసే ఉద్దేశం ఉందా అనే దానిపై మస్క్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## సిట్ నన్ను అడగడం కాదు.. నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా

హైదరాబాద్, జనవరి 20 (భారత శక్తి):ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తనను ప్రశ్నించడం కాదని, తానే సిట్‌కు వంద ప్రశ్నలు వేశానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. దమ్ముంటే ఈరోజు విచారణకు సంబంధించిన వీడియోలను విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను హోంమంత్రిగా ఎప్పుడైనా పని చేశానా అని వ్యాఖ్యానించారు. నాటి డీజీపీ, చీఫ్ ఇంటెలిజెన్స్‌ను కూడా విచారణకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు దాదాపు ఏడు గంటల పాటు విచారించారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నోటీసులు, విచారణలు బీఆర్ఎస్‌ను భయపెట్టలేవని ఆయన అన్నారు. రేపు ప్రజా కోర్టులో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల గురించి మంత్రులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అరెస్టులు తమకు కొత్తేమీ కాదని ఆయన అన్నారు. ముగ్గురు అధికారులతో కూడిన సిట్ దర్యాప్తు బృందం తనను ప్రశ్నించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయతీపరుడైతే ఈ అంశంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపందలా పోలీసులను వెనుకబెట్టుకుని కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, సిట్ అధికారులు ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని ఆయన అన్నారు. వారి కుంభకోణాలు, చీకటి రాజకీయాలను బయటపెడుతున్నామని తమపై కేసులు పెడుతున్నారని హరీశ్ ఆరోపించారు. మీ దోపిడీలను ప్రశ్నిస్తున్నామని, మాపై కేసులు పెడతారా అని నిలదీశారు. తమపై అన్నీ నిరాధార ఆరోపణలేనని, సొల్లు పురాణాలేనని విమర్శించారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష వింటేనే రోత పుడుతోందని అన్నారు. రేవంత్ రెడ్డిలా తమకు వెన్నుపోట్లు తెలియవని, పోరాటాలు మాత్రమే తెలుసని ఆయన అన్నారు. కేసీఆర్ తమకు నేర్పింది పోరాటమే అన్నారు. ఇప్పుడు తనకు సిట్ ద్వారా వచ్చిన నోటీసులు మీ పతనానికి నాంది అని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ధైర్యం ఉంటే తమను రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు. మీ చిల్లర, బురద, కుట్ర, కుతంత్రాల రాజకీయాలు ఇక నడవవని అన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు విస్మరించారని ఆరోపించారు.

## బలవంతంగా ట్రాఫిక్ చలాన్లు వసూలు చేయవద్దు

తెలంగాణ, జనవరి 20 (భారత శక్తి):తెలంగాణ హైకోర్టు వాహనాల పెండింగ్ చలాన్‌లపై కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్‌ల విషయంలో వాహనదారులను బలవంత పెట్టవద్దని ట్రాఫిక్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా చలాన్‌లు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయవాది విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు. పెండింగ్ చలాన్‌ల వసూలు కోసం ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ట్రాఫిక్ పోలీసులకు ఈ ఆదేశాలు జారీ చేసింది. చలాన్‌లు చెల్లించాలని వాహనాల తాళాలు లాక్కోవడం, వాహనాన్ని ఆపడం వంటి చర్యలకు పాల్పడవద్దని ట్రాఫిక్ పోలీసులకు సూచించింది. వాహనం ఆపినప్పుడు వాహనదారు స్వచ్ఛందంగా చలాన్‌లు చెల్లిస్తే పోలీసులు వసూలు చేయవచ్చని పేర్కొంది. వాహనదారులు చలానా చెల్లించడానికి ఇష్టపడకుంటే చట్ట ప్రకారం వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది.

## దావోస్‌లో ఐబీఎం చైర్మన్ తో సీఎం చంద్రబాబు కీలక సమావేశం

దావోస్, జనవరి 20: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రపంచ ప్రఖ్యాత టెక్ సంస్థ ఐబీఎం చైర్మన్, సీఈవో అరవింద్ కృష్ణతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్, ప్రత్యేకించి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు ఐబీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు పూర్తి సహకారం అందించాలని వారు ఐబీఎంను కోరారు. ఈ భేటీ ఫలప్రదంగా జరిగిందని, రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఇదే భేటీలో యువతకు కృత్రిమ మేధలో శిక్షణ ఇచ్చే అంశంపైనా చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎం సిద్ధంగా ఉందని అరవింద్ కృష్ణ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 10 లక్షల మంది యువతకు అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో భాగంగా చంద్రబాబు, లోకేశ్ బృందం టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు వరుస భేటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐబీఎంతో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## స్కిల్స్ ఉన్నాయి.. కానీ సంతృప్తి లేదు..

ఢిల్లీ, జనవరి 20 (భారత శక్తి):భారత్‌లోని ఉద్యోగుల్లో ఓ ఆసక్తికరమైన వైరుధ్యం కనిపిస్తోంది. దాదాపు 95 శాతం మంది తమ నైపుణ్యాలపై పూర్తి విశ్వాసంతో ఉన్నప్పటికీ, కేవలం 64 శాతం మంది మాత్రమే తమ ఉద్యోగంతో సంతృప్తిగా ఉన్నట్లు మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఇవాళ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1,000 మందికి పైగా ఉద్యోగుల నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించారు. నివేదిక ప్రకారం తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించగలమనే నమ్మకం 95 శాతం మందిలో ఉంది. కెరీర్ డెవలప్‌మెంట్ అవకాశాలు ఉన్నాయని 90 శాతం, ప్రమోషన్లు వస్తాయని 84 శాతం, ఏఐ (AI) టెక్నాలజీని వాడటంలో నమ్మకంగా ఉన్నామని 90 శాతం మంది తెలిపారు. అయితే, ఈ ఆత్మవిశ్వాసం వారిలో ఉద్యోగ సంతృప్తిని పెంచడం లేదని నివేదిక స్పష్టం చేసింది. సుమారు 53 శాతం మంది రోజూ తీవ్రమైన లేదా ఒక మోస్తరు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తేలింది. మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా, మిడిల్ ఈస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ గులాటి మాట్లాడుతూ.. "అధిక పనిభారం, ఎక్కువ పని గంటల కారణంగా 75 శాతం మంది బర్న్‌అవుట్‌కు గురవుతున్నారు. చాలామంది కొత్త అవకాశాల కోసం చూస్తున్నప్పటికీ, దాదాపు సగం మంది భద్రత కోసం ఉన్న ఉద్యోగాన్నే అంటిపెట్టుకుని ఉంటున్నారు" అని వివరించారు. బ్లూ కాలర్ వర్కర్లలో (68 శాతం) శ్రేయస్సు తక్కువగా ఉండగా, జెన్‌జెడ్ మహిళలు (64 శాతం) అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వైట్ కాలర్, సీనియర్ మేనేజర్లు తమ పనిలో సంతృప్తి పొందుతున్నప్పటికీ, వారే అత్యంత ఒత్తిడికి గురవుతున్న గ్రూపులుగా ఉన్నారని తేలింది. రంగాల వారీగా చూస్తే, ఎనర్జీ, యుటిలిటీస్ రంగంలో ఉద్యోగుల శ్రేయస్సు (72 శాతం) అత్యల్పంగా ఉంది. హెల్త్‌కేర్ (52 శాతం), ఫైనాన్షియల్స్ (50 శాతం) రంగాల వారు ఉద్యోగ భద్రతపై తక్కువ నమ్మకంతో ఉన్నారు. కేవలం నైపుణ్యాలపై విశ్వాసం ఉంటే సరిపోదని, ఉద్యోగులను నిలుపుకోవాలంటే కంపెనీలు స్పష్టమైన కెరీర్ మార్గాలు, మేనేజర్లపై నమ్మకం, ఉద్యోగుల సంక్షేమంపై పెట్టుబడి పెట్టాలని సందీప్ గులాటి సూచించారు.





## సంప్రదాయబద్ధంగా శబరిమల ఆలయం మూసివేత

కేరళ, జనవరి 20 (భారత శక్తి):కేరళలోని ప్రఖ్యాత శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు నెలలకు పైగా సాగిన మండల-మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర మంగళవారం ఉదయంతో ముగిసింది. సంప్రదాయబద్ధమైన పూజల అనంతరం ఉదయం 6:45 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) ప్రకటించింది. ఆనవాయితీ ప్రకారం పందలం రాజకుటుంబ ప్రతినిధి పునర్తం నాళ్ నారాయణ వర్మ చివరి దర్శనం చేసుకున్న తర్వాత ఆలయాన్ని మూసివేశారు. అంతకుముందు ఉదయం 5 గంటలకు గణపతి హోమంతో నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. ప్రధాన పూజారి (మేల్శాంతి) ఈడీ ప్రసాద్ నంబూద్రి, అయ్యప్ప స్వామి విగ్రహానికి విభూతి అభిషేకం నిర్వహించి, రుద్రాక్ష మాలతో అలంకరించారు. అనంతరం పవిత్రమైన 'హరివరాసనం' గానం తర్వాత గర్భగుడి తలుపులను మూసివేశారు. ఆలయ తాళపు చెవులను రాజకుటుంబ ప్రతినిధికి అప్పగించగా, ఆయన వాటిని శబరిమల పరిపాలనా అధికారి ఎస్. శ్రీనివాసన్‌కు అందజేశారు. నెలవారీ ఖర్చుల కోసం ఉంచే డబ్బుల సంచిని కూడా ఇదే సమయంలో అప్పగించడం ఇక్కడి సంప్రదాయం. ఇదే సమయంలో పవిత్ర తిరువాభరణాల తిరుగు ప్రయాణం కూడా మొదలైంది. 30 మంది సభ్యుల బృందం ఈ ఆభరణాలను తిరిగి పందలం ప్యాలెస్‌కు తీసుకువెళ్తోంది. ఈ బృందం ఈ నెల 23న పందలం చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది మండలమకరవిళక్కు సీజన్ చాలా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిందని టీడీబీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యాత్ర పూర్తయిందని తెలిపారు. పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

**మళ్లీ తెరిచేది ఎప్పుడంటే?**

తాజాగా ఆలయాన్ని మూసివేసినప్పటికీ, నెలవారీ పూజల కోసం ఫిబ్రవరిలో మళ్లీ తెరవనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు కుంభం మాసపు పూజల కోసం ఆలయాన్ని తెరిచి, ఫిబ్రవరి 17వ తేదీ రాత్రి 10 గంటలకు తిరిగి మూసివేస్తారు. ఈ సమయంలో భక్తులు దర్శనానికి రావొచ్చని టీడీబీ స్పష్టం చేసింది.

## ఇకపై నితిన్ నబినే నా బాస్.. నేను కార్యకర్తను మాత్రమే

జనవరి 20 (భారత శక్తి): బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ (46) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో ఈ పదవిని చేపట్టిన నేతగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షించాయి. "ఇకపై పార్టీ వ్యవహారాల్లో నితిన్ నబిన్ నా బాస్, నేను ఒక సాధారణ కార్యకర్తను మాత్రమే" అని మోదీ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'సంఘటన్ పర్వ్' కార్యక్రమంలో నితిన్ నబిన్ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా.. నూతన అధ్యక్షుడిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పార్టీ రాజ్యాంగానికి అనుగుణంగా ప్రజాస్వామ్యబద్ధంగా సంస్థాగత ఎన్నికలు జరిగాయని తెలిపారు. "ప్రభుత్వ అధినేతగా నాకు ఎంత అనుభవం ఉన్నా, అన్నింటికంటే ముందు నేను బీజేపీ కార్యకర్తను. ఈ విషయంలో గర్వపడతాను" అని మోదీ అన్నారు. "వికసిత భారత్ నిర్మాణానికి రానున్న 25 ఏళ్లు చాలా కీలకం. ఈ ముఖ్యమైన సమయంలో నితిన్ నబిన్ పార్టీని ముందుకు నడిపిస్తారు. ఆయన ఒక మిలీనియల్ (జనరేషన్ వై... జెన్ జెడ్ కు ముందు తరం), యువ శక్తితో పాటు సంస్థాగత అనుభవం కూడా ఉంది" అని ప్రధాని ప్రశంసించారు. అటల్ జీ, అద్వానీజీ నుంచి జేపీ నడ్డా వరకు పార్టీ అధ్యక్షులుగా చేసిన సేవలను మోదీ గుర్తు చేసుకున్నారు. నాయకులు మారినా పార్టీ సిద్ధాంతాలు, దిశ మారవని స్పష్టం చేశారు. అనంతరం మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన యువకుడైన నితిన్ నబిన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం చరిత్రాత్మకమని అన్నారు. పార్టీకి మార్గనిర్దేశం చేసిన ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేవలం ఒక్కరే నామినేషన్ వేయడంతో బీజేపీ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎలక్టోరల్ కాలేజ్ నితిన్ నబిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

## దావోస్‌లో ట్రంప్ విందు.. భారత కంపెనీల సీఈవోలకు ఆహ్వానం

దావోస్, జనవరి 20: దావోస్ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేయనున్న ప్రత్యేక విందుకు ఏడుగురు భారతీయ సీఈఓలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు తరలి వస్తున్నారు. ఆరేళ్ల తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సులో పాల్గొననుండటం విశేషం. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొనడం ఇది మూడోసారి. ట్రంప్ ఏర్పాటు చేయనున్న ఈ విందుకు టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిట్టల్, విప్రో సీఈఓ శ్రీని పల్లియా, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, బజాజ్ ఫిన్ సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్, మహీంద్రా గ్రూపు సీఈఓ అనీశ్ షా, జుబిలెంట్ భర్తియా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు హరి భర్తియాలు హాజరయ్యే అవకాశం ఉంది. ప్రపంచ ఆర్థిక సదస్సుకు 130 దేశాల నుంచి 3 వేలకు పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు.



# మేడారం జాతరలో 'స్వచ్ఛ' విప్లవం: 22 భాషల్లో అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

* పర్యావరణ పరిరక్షణలో 'ప్రపంచ పర్యావరణ సంస్థ' ముందడుగు..
* ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ప్రశంసలు.. 'స్వచ్ఛ ఇండోర్' స్ఫూర్తితో సాగాలని పిలుపు..

హైదరాబాద్, జనవరి 20 (భారత శక్తి) : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన వేడుక, కోట్లాది మంది భక్తుల కొంగుబంగారం మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరను పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు 'ప్రపంచ పర్యావరణ సంస్థ' (WEO) నడుం బిగించింది. 2026 జనవరి 28 నుండి 31 వరకు జరగనున్న ఈ మహా జాతరలో ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టడమే లక్ష్యంగా సంస్థ రూపొందించిన 'స్వచ్ఛ మేడారం' గోడపత్రికలు, క్లాత్ బ్యానర్లను ప్రముఖ ఐఏఎస్ అధికారి శ్రీ పరికిపండ్ల నరహరి ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో ఈ అవగాహన పత్రాలను రూపొందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

**ఇండోర్ స్ఫూర్తి.. మేడారం లక్ష్యం**

ఈ సందర్భంగా శ్రీ పరికిపండ్ల నరహరి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రపంచ పర్యావరణ సంస్థ గత 14 ఏళ్లుగా సాగిస్తున్న పోరాటం అభినందనీయమని కొనియాడారు. "దేశంలోనే స్వచ్ఛ నగరంగా వరుసగా ఎనిమిది సార్లు రికార్డు సృష్టించిన ఇండోర్ ప్రస్థానంలో ప్రజా భాగస్వామ్యమే కీలక పాత్ర పోషించింది. అదే స్ఫూర్తితో ఇప్పుడు మేడారం జాతరను కూడా ప్లాస్టిక్ రహితంగా మార్చుకోవాలి. అడవిని, అడవి బిడ్డల అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.



బడి నుంచి గుడి వరకు.. పర్యావరణ చైతన్యం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్. భద్ర మాట్లాడుతూ, 'ప్రకృతి ఉపాధ్యాయుడు ప్రకృతి మా భవిష్యత్తు' అనే నినాదంతో ఇప్పటికే 2000 పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

* జ్యూట్ బ్యాగుల పంపిణీ: ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా లక్షలాది జ్యూట్ బ్యాగులను భక్తులకు ఉచితంగా అందజేయనున్నారు.
* బహుభాషా ప్రచారం: దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు అర్థమయ్యేలా 22 భాషల్లో ప్రచార సాగించనున్నారు.
* యువజన భాగస్వామ్యం: గత నాలుగు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి, వేలాది మంది విద్యార్థులతో 'స్వచ్ఛ మేడారం' ప్రతిజ్ఞ చేయించినట్లు జాతీయ యువజన కార్యదర్శి సుమేర్ వివరించారు.

**విశిష్ట సేవా యజ్ఞం**

ఈ కార్యక్రమంలో కలయిక ఫౌండేషన్ చైర్మన్ చీరాల నారాయణ మాట్లాడుతూ, పర్యావరణ కాలుష్యం నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలని, దానిని ఎదుర్కోవడంలో నరహరి గారి లాంటి అధికారుల స్ఫూర్తి అవసరమని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, కోశాధికారి ఎండి. రెజ్వన్, స్కూల్స్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఏ. జోత్స్నారావు, జాతీయ కార్యదర్శి సిహెచ్. సాగర్ తదితరులు పాల్గొని, మేడారం జాతరను పర్యావరణ హితంగా మార్చడమే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు.



## శ్రీ త్రిశక్తి దేవాలయంలో వైభవంగా 12వ వార్షికోత్సవం..

* బి.ఎన్. రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రత్యేక పూజలు

వనస్థలిపురం, జనవరి 20 (భారతశక్తి) : బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురంలో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ త్రిశక్తి దేవాలయ 12వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భక్తిభావం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. కాలనీ వాసులంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, వార్షికోత్సవ వేడుకలకు కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు అండగా కవితక్క పోరాటం..!

* కవితక్కకు అధ్యయన నివేదిక అందజేత
* కాంగ్రెస్ తీరుపై కప్పాటి పాండురంగారెడ్డి విమర్శలు

హైదరాబాద్, జనవరి 20 (భారతశక్తి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ప్రస్తుత ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల స్థితిగతులపై 'తెలంగాణ జాగృతి ఉద్యమకారుల సంక్షేమ కమిటీ' నిర్వహించిన క్షేత్రస్థాయి అధ్యయన నివేదికను సోమవారం హైదరాబాద్‌లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు అందజేశారు.

**క్షేత్రస్థాయిలో కష్టాల కడలి**

రాష్ట్రంలోని ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక ఇబ్బందులపై కమిటీ సభ్యులు లోతైన అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. "ఉద్యమ సమయంలోనూ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులు అనేక కష్టనష్టాలకు గురవుతున్నారు. వారి సంక్షేమం కోసం కవితక్క నిరంతరం కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను, వాటికి కావాల్సిన పరిష్కార మార్గాలను ఈ నివేదికలో పొందుపరిచాం" అని వివరించారు.



**సర్కారుపై విమర్శలు**

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు. దగా పడ్డ ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా, ఉద్యమకారుల సంక్షేమం కోసం కవిత చేపట్టబోయే భవిష్యత్తు కార్యాచరణకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమ సంఘాలు, కార్యకర్తలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ గౌడ్, ములుగు జిల్లా అధ్యక్షుడు నంగావత్ రాజేష్, శీలం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి స్టీరింగ్ కమిటీ ప్రతినిధుల సమక్షంలో ఈ నివేదికపై సుదీర్ఘంగా చర్చించారు.



## ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

బడంగ్‌పేట్, జనవరి 20 (భారత శక్తి) : బడంగ్‌పేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారని, సంఘం ఐక్యంగా ఉంటూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తోనుపునూరి శ్రీనివాస్ గుప్తా, దాచేపల్లి వెంకటేశ్వర్లు, విరమల్లి రామమూర్తి, సంఘం కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్..

* రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదు: డీసీ త్రిల్లేశ్వర్ రావు హెచ్చరిక..

బడంగ్‌పేట్, జనవరి 20 (భారత శక్తి) : బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు అధికారులు నడుం బిగించారు. సర్కిల్ 16 డిప్యూటీ కమిషనర్ శ్రీ త్రిల్లేశ్వర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం అన్ని డివిజన్లలో 'స్పెషల్ సానిటేషన్ డ్రైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించడమే కాకుండా, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.

**అవగాహనతోనే మార్పు..**

పర్యటనలో భాగంగా డీ.సీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

* ముఖ్యంగా: రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు.
* తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకే అందించాలి.
* బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకూడదు.
* తగ్గించడం (Reduce), తిరిగి వాడటం (Reuse), రీసైకిల్ (Recycle) పద్ధతులపై ప్రజలు దృష్టి సారించాలని కోరారు.



* నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానా..
* తనిఖీల్లో భాగంగా రోడ్లపై చెత్త వేసిన పలువురికి అధికారులు అక్కడికక్కడే పెనాల్టీలు విధించారు.
* డివిజన్ 58: బాలాపూర్ చౌరస్తాలో రోడ్డుపై చెత్త వేసినందుకు జరిమానా.
* డివిజన్ 59: జిల్లెలగూడ ప్రధాన రహదారిపై అపరిశుభ్రతకు కారణమైన వారికి జరిమానా.
* డివిజన్ 60: మిర్పేట్ భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో చెత్త వేసిన వారికి పెనాల్టీ.
* డివిజన్ 61: బడంగ్‌పేట్ శ్రీ దుర్గ లక్ష్మీ మార్ట్ మరియు బాక్స్ క్రికెట్ ప్రాంతాల్లో చెత్త వేయడమే కాకుండా, దానిని తగులబెట్టినందుకు కఠినంగా జరిమానాలు విధించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు.. డీవైఈఈ (SWM) ఎం. అభినయ్ కుమార్, ఏఈ గంగా ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వి. యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ ఎం. నర్సింహా, పర్యావరణ ఇంజనీర్ రాము, వార్డు అధికారులు, జవాన్లు మరియు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



## మాత వాసవి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): మాత వాసవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా హయత్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతీక అయిన మాత వాసవి దేవి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజహితాన్ని కాంక్షిస్తూ మాత వాసవి చేసిన ఆత్మార్పణ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, నైతిక విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సంఘ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 20 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్‌లోని దత్తాత్రేయ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గత ఐదు సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తూ నిరంతరం కృషి చేస్తున్న కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కాలనీలో కొంతమేర భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ కొరత ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ భూగర్భ డ్రైనేజ్, మంచినీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. తమ పదవీ కాలంలోనే దత్తాత్రేయ కాలనీలో మిగిలి ఉన్న కొద్దిపాటి



భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.